**WANTED**

**జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.**

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

**సంప్రదించాల్సిన నెంబర్లు:**
**9492580091**

Facebook.varadhi telangana

# విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి : 1
సంచిక : 70
శుక్రవారం
15.11. 2024




పల్లె పోరుకు అధికార యంత్రాంగము సన్నద్ధమవుతోంది. జనవరిలో గ్రామపంచాయతీ ఎన్నికలు ఉంటాయని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించడం జిల్లాలో ఎన్నికల హడావిడి ఊబందుకుంది ఈ ఏడాది ఫిబ్రవరి 8 వరకు నమోదైన ఓటరు జాబితా ప్రకారం జిల్లా పంచాయతీరాజ్ శాఖ వార్డుల వారీగా ఓటర్లను విభజించి. సెప్టెంబర్ లో ప్రకటించింది. తాజాగా ఫిబ్రవరి 9 నుంచి 30 సెప్టెంబర్ వరకు కొత్తగా నమోదైన ఓటర్ల జాబితా ఆధారంగా మరొక ఓటర్ల లిస్టు సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ ఆర్డర్స్ ఇచ్చింది. ఈ 8 నెలల్లో కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలు ఎన్నికల కమిషన్ టీ- పోల్లో పొందుపరిచింది ఈ జాబితా ప్రకారం వార్డుల వారీగా సప్లమెంటరీ ఓటర్ల లిస్ట్ ప్రిపేర్ చేయాలని ఆదేశించింది. సెప్టెంబర్ లో ప్రకటించిన ఓటర్ల జాబితా జోలికి పోకుండా కేవలం ఈ 8 నెలల్లో చేరిన కొత్త ఓటర్లకే వార్డుల వారీగా విభజించాలని స్పష్టం చేసింది.

# పల్లె పోరుకు సన్నద్ధం

- మలి విడత ఓటరు జాబితా సిద్ధం చెయ్యాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు
- ఫిబ్రవరి 9 నుండి సెప్టెంబర్ 30 వరకు నమోదైన కొత్త ఓటర్లే టార్గెట్
- బీసీ కులగనన. బీసీ కమిషన్ ఏర్పాటుతో ఆశావాహుల్లో సందడి
- రిజర్వేషన్ల పెంపుతో కొత్త రిజర్వేషన్లు వస్తాయని ఆశలు

వారధి న్యూస్: మెదక్ బ్యూరో :

ఈనెల 25 తేదీలోగా ఓటర్ లిస్ట్ ప్రిపేర్ చేసి 26 నా మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మీటింగ్ నిర్వహించాలని ఎంపీడీవోలకు సూచించారు. జాబితాలో కొత్తగా చేరిన ఓటర్ల కొత్తగా చేసిన ఓటర్లు తొలగించిన ఓటర్ల వివరాలను పార్టీల వివరించాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు పేర్కొంది. దీంతో పంచాయతీ ఓటర్లు ఎంతమంది ఉన్నారనే లెక్క కొలిక్కి వస్తుంది ఆ తర్వాత ఎన్నికల నిర్వహణపైనే కమిషన్ మరో అడుగు వేస్తుందని అధికారులు చెప్తున్నారు.

మిగతా 8 లో

ఎన్ని రోజులు అరెస్టు చేయిస్తాడో

# మేమూ చూస్తాం

- ప్రభుత్వంపై వ్యతిరేకత కొడంగల్ నుంచే ప్రారంభమైంది
- కాంగ్రెస్‌కు ఓటేసినందుకు భూములు గుంజుకుంటావా..?
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



**హైదరాబాద్, నవంబర్ 14:** ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ఇప్పుడు అనుభవిస్తున్నారని, రైతుల నుంచి బలవంతంగా ఇప్పుడు రేవంత్‌రెడ్డి భూములు గుంజుకుంటున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని హరీశ్‌రావు గురువారం పరామర్శించారు.

మిగతా 3లో

దాడి కారుకుడు సురేశ్‌కు

# భూమే లేదు

- లగచర్ల ఘటనలో సంచలన విషయాలు
- సర్కారుకు కలెక్టర్ నివేదించినట్లు సమాచారం
- దాడిలో పాల్గొనలేదంటున్న గ్రామస్థులు
- హైదరాబాద్ మీడియా ముందు గగ్గోలు

02




రైతుల ముసుగులో

# గులాబీ గుండాల అరాచకం

- అరచాకం సృష్టిస్తే కఠినంగా అణచివేస్తాం
- లగచర్లలో దాడిని ఉపేక్షించేది లేదు
- రైతులకు నష్టం చేసే ఉద్దేశ్యం లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరిక

హైదరారాబాద్, నవంబర్ 14 : రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శలు చేశారు. కుట్రపూరితంగా అధికారులను రైతులకు దూరం చేసే ప్రయత్నం కొంతమంది చేస్తున్నారని మండిపడ్డారు. గులాబీ గూండాల కుట్రలను రైతాంగం అర్థం చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజలను కాపాడుకున్నట్లే, అధికారులను కాపాడుకోలేకపోతే పని చేయడానికి ఏ అధికారి ముందుకు వస్తారని ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి పొంగులేటి

మిగతా 2 లో




# నాణ్యమైన భోజనం పెట్టకుంటే జైలుకే

విద్యార్థుల కలలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- సన్నబియ్యం అన్నం పెట్టాలి
- హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ జరిగితే కఠిన చర్యలు
- ప్రభుత్వ బడుల ప్రతిష్ఠ పెంచాల్సిన బాధ్యత టీచర్లదే
- కులగణనపై ఎలాంటి అపోహలు వద్దు
- ఎవరికీ సంక్షేమ పథకాలు తొలగించం
- రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి బాలల దినోత్సవం
- బాలల దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 14 : రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి. బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని పదోన్నతులు ఇచ్చాం, బదిలీలు చేశాం. 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. టీచర్ పోస్టుల భర్తీ ద్వారా విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించామని సీఎం తెలిపారు.

మిగతా 2 లో



## చట్ట సభలకు వయోపరిమితి తగ్గించాలి : సీఎం రేవంత్‌రెడ్డి

దేశంలో చట్ట సభలకు పోటీ చేయడానికి వయోపరిమితిని 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరుతూ పిల్లల మాక్ అసెంబ్లీ తీర్మానం చేసి దేశ ప్రధానమంత్రికి, రాష్ట్రపతి గారికి పంపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. వయోపరిమితి తగ్గించడం వల్ల యువత వారి అవసరాలకు అనుగుణంగా రాణిస్తారని అన్నారు.

మిగతా 2 లో



మిగతా 2 లో

## గ్రూప్-4 ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నవంబర్ 14 :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 ఫలితాలను వెల్లడించింది. 8,084 మందితో కూడిన ప్రొవిజినల్ జాబితాను విడుదల చేసింది. 2022 డిసెంబర్ 1న ఇచ్చిన నోటిఫికేషన్‌లో భాగంగా 8,180 పోస్టులకు గాను 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. పలు దఫాల్లో ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఈరోజు ఫలితాలు వెల్లడించింది. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.



02

కాంగ్రెస్ పాలనపై

## మావోల లేఖ

హామీలను మర్చి పాలన సాగిస్తుందని మండిపాటు

మరోసారి విచారణకు

## రేవంత్ గైర్హాజరు

02

ఓటుకు నోటు కేసు వచ్చే నెల 16కు వాయిదా

### దాడి కారకుడు

# సురేష్‌కు భూమే లేదు

హైదరాబాద్, నవంబర్ 14 : లగచర్ల ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏ1గా ఉన్న బీఆర్ఎస్ నేత సురేష్‌కు అసలు భూమి లేదని వికారాబాద్ కలెక్టర్ తేల్చారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ ఇచ్చిన నివేదికలో కీలక అంశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సురేష్, అతని సోదరుడు మహేష్‌కు ఎలాంటి భూమి లేదని నివేదిక పేర్కొన్నట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న 42 మంది నిందితుల్లో 19 మందికి భూమి లేదని కలెక్టర్ గుర్తించి, తెలియచేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ దాడి ఘటనలో ఇప్పటికే బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా 16మందిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇదిలావుంటే తెలంగాణలో వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటన సంచలనం సృష్టిస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర రెవెన్యూ సిబ్బందితో గ్రామస్తులు తిరగబడి దాడి చేయడం తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటన వెనక రాజకీయ కుట్ర ఉందని అనుమానిస్తోన్న ప్రభుత్వం లగచర్ల ఘటనను సీరియస్‌గా తీసుకుని సమగ్ర దర్యాప్తుకు ఆదేశించింది. లగచర్ల ఘటనలో ఇప్పటికే బీఆర్ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేరు కూడా ఈ ఘటనలో తెరపైకి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో లగచర్ల గ్రామంలో రాష్ట్రంలో ఒక్కసారిగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో లగచర్ల గ్రామస్తులు మీడియా ముందుకు వచ్చారు. లగచర్ల గ్రామ ప్రజలు హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. 'మా గ్రామానికి ఫార్మా కంపెనీ వస్తుందని ప్రచారం చేశారు. ఫార్మా కంపెనీ పెడితే మా భూములు కోల్పోతాం. మా భూములు లాక్కోవాలని చూస్తున్నారు. మాకు ఫార్మా కంపెనీ వద్దు. ఫార్మా కంపెనీ వలన మాకు రోగాలు వస్తాయని అన్నారు. అసలు కలెక్టర్ మా ఊరికి వస్తున్నాడని మాకు తెలియదు. మేము ఎవరిపై దాడులు చేయలేదు. మాపై, మా కుటుంబాలపై దాడులు చేశారు. పోలీసులు మా కుటుంబ సభ్యులను అరెస్ట్ చేశారు. వాళ్లను వెంటనే విడుదల చెయ్యాలి. మాకు ఏం జరిగిన ఫార్మా కంపెనీ ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదని అన్నారు. లగచర్ల ఘటన రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోన్న వేళ ఏకంగా.. ఆ గ్రామ ప్రజలకు మీడియా ముందుకు రావడం చర్చనీయాంశంగా మారింది.

# ఫోన్‌ట్యాపింగ్‌తో సంబంధం లేదు

**హైదరారాబాద్, నవంబర్ 14** : ఫోన్ ట్యాపింగ్ కేసులో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విచారణ ముగిసింది. తిరుపతన్నతో మాట్లాడిన ఫోన్ కాల్స్‌పై హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు మాజీ ఎమ్మెల్యేను విచారించారు. ప్రస్తుత నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులైన మదన్ రెడ్డి, రాజ్ కుమార్ ఫోన్ల ట్యాప్ చేయడంపై పలు ప్రశ్నలు సంధించారు. ఈ ఇద్దరి ఫోన్‌లు ట్యాప్ చేసినట్టు వచ్చిన రిపోర్టును లింగయ్య ఎదుటపెట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. మునుగోడు ఉపఎన్నికల సందర్భంగా డబ్బు తరలింపుపైనా ప్రశ్నలు సంధించారు. విచారణ అనంతరం చిరుమర్తి లింగయ్య మీడియాతో మాట్లాడారు. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. తనకు తెలిసిన అధికారి కాబట్టి నేను గతంలో అడిషనల్ ఎస్పీ తిరుపతన్నతో మాట్లాడాను. మదన్ రెడ్డి, రాజ్ కుమార్ ఫోన్ నంబర్లు తిరుపతన్న అడిగారు. వారిద్దరి ఫోన్ నంబర్స్ నా అనుచరుల వద్ద తీసుకుని అతనికి ఇచ్చాను. నంబర్లు ఎందుకు ఆడిగావని నేను తిరుపతన్నను ప్రశ్నించా. కానీ మునుగోడు ఎన్నికల సమయంలో ప్రచారం ఎలా జరుగుతుందని తిరుపతన్న నన్ను అడిగారు. ప్రచారం బాగానే జరుగుతోందని నేను ఫోన్లో చెప్పా. ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరుల ఫోన్ ట్యాప్ చేశారనేది అవాస్తవం. మీడియాలో ఎక్స్‌పోజ్ అవ్వాలనే ఉద్దేశంతో కొంతమంది నాపై తప్పుడు కామెంట్స్ చేస్తున్నారు. ఈ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా పోలీసులకు నేను సహకరిస్తా. ఈ కేసుతో నాకు ఎటువంటి సంబంధం లేదు. తిరుపతన్నతో మాట్లాడిన కాల్ లిస్ట్ ఆధారంగానే నన్ను ప్రశ్నించారు. పోలీసుల దగ్గర ఏదో ఆధారం ఉంది కాబట్టే నన్ను విచారించారని భావిస్తున్నా. నా స్టేట్మెంట్‌ను వీడియో రికార్డ్ చేశారు. ఎప్పుడు విచారణకు పిలిచినా సహకరిస్తాఅని చెప్పారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలైన బొల్లం మల్లయ్య, పైళ్ల శేఖర్ రెడ్డికి సైతం పోలీసులు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. చిరుమర్తి లింగయ్య విచారణ తర్వాత మల్లయ్య, శేఖర్ రెడ్డిలను విచారించే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటిసారిగా రాజకీయ నేతలను పోలీసులు విచారిస్తున్నారు. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ ఎమ్మెల్యే లింగయ్య విచారణ తర్వాత మరో మాజీ మంత్రికి పోలీసులు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.

### మరోసారి విచారణకు

# రేవంత్‌రెడ్డి గైర్హాజరు

### ఓటుకు నోటు కేసు వచ్చే

### నెల 16కు వాయిదా



**హైదరాబాద్, నవంబర్ 14 : ఓటుకు** నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మరోసారి విచారణకు గైర్హాజరయ్యారు. దీంతో వచ్చే నెల 16ను కేసు విచారణ వాయిదా పడింది. గురువారం విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది. విచారణకు సండ్ర వెంకట వీరయ్య, ఉదయ్ సింహా, మత్తయ్య, సెబాస్టియన్ హాజరు కాగా, సీఎం రేవంత్ రెడ్డి, వేం కృష్ణ కీర్తన్ గైర్హాజరయ్యారు. కాగా, గత నెల 16న జడ్జి లీవ్‌లో ఉండటంతో కోర్టు కేసును నేటికి వాయిదా వేసిన విషయం తెలిసిందే. 2015 మే 31న ఓటుకు నోటు కేసులో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మరో ఎమ్మెల్యే స్టిఫెన్‌సన్‌కు నోట్ల కట్టలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినట్టు అభియోగాలున్నాయి. దీనిపై ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. రేవంత్‌రెడ్డితోపాటు సెబాస్టియన్, ఉదయ్‌సింహా, సండ్ర వెంకటవీరయ్యతోపాటు రూ.50 లక్షలు సమకూర్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వేం కృష్ణకీర్తన్ తదితరులపై కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే ఓటుకు నోటు కేసులో మనీ లాండరింగ్ జరిగినట్టు గుర్తించిన ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా నాంపల్లిలోని ఈడీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, ఈడీ కోర్టు విచారణకు నిందితులు కొంతకాలంగా హాజరు కావడం లేదు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మిగతా నిందితులు సైతం కోర్టుకు హాజరుకాకుండా, గైర్హాజరీ పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. దీనిని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. నిందితులు కోర్టుకు హాజరుకాకుండా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ మండిపడింది. మరోవైపు, ఏసీబీ నమోదుచేసిన ఓటుకు నోటు కేసు విచారణ కూడా నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో కొనసాగుతున్నది.

# చట్ట సభలకు వయోపరిమితి తగ్గించాలి

### 21 ఏళ్లకే పోటీ చేసే చట్టసవరణ జరగాలి

### విద్యార్థుల మాక్ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి



**హైదరారాబాద్, నవంబర్ 14 :** ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థుల వయోపరిమితి తగ్గించాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఓటింగ్ వయసును 18 ఏళ్లకు తగ్గించిన క్రమంలో పోటీ చేసే వయసును కూడా తగ్గించే అవకాశాన్ని పరిశీలించాల్సి ఉందని అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఎన్‌సీఈఆర్‌టీలో విద్యార్థులు నిర్వహించిన అండర్-18 మాక్ అసెంబ్లీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేయాలంటే 25 ఏళ్లు నిండాలనే నిబంధన ఉంది. ఓటు హక్కు పొందేందుకు వయోపరిమితి 21 సంవత్సరాల నుంచి 18ఏళ్లకు తగ్గించారు. కానీ, ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేయడానికి 25 ఏళ్ల వయసు ఉండాలనే నిబంధనను మాత్రం సవరించలేదు. ఈ నిబంధనను కూడా సవరించుకుని .. 21 ఏళ్లు నిండిన వారు శాసనసభకు పోటీ చేసే అవకాశం కల్పిస్తూ చట్ట సవరణ చేయాలి. తద్వారా యువత చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం ఉంటుంది. 21 ఏళ్లు నిండిన వారు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా పనిచేస్తున్నప్పుడు... 21 ఏళ్లు నిండిన వారు శాసనసభ్యులుగా కూడా రాణిస్తారని బలంగా నమ్ముతున్నా. మాక్ అసెంబ్లీ తీర్మానాల్లో ఈ అంశాన్ని కూడా చేర్చి రాష్ట్రపతి, ప్రధానమంత్రికి పంపించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందులోభాగంగా మాట్లాడుతూ ఇలాంటి సమావేశాలు సమాజానికి చాలా అవసరం అని అన్నారు. అలాగే శాసన సభలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలు, సమాధానాలు... ఇతర అంశాలను విద్యార్థులు గమనించాలని సూచించారు. విపక్షాలు ప్రశ్నించడం, ప్రభుత్వాన్ని నిలదీయడం వారి బాధ్యతని గుర్తు చేశారు.లీడర్ ఆఫ్ ది హౌస్, లీడర్ ఆఫ్ ది అపొజిషన్ ఇద్దరికీ సమాన అవకాశాలు ఉంటాయని, సభను సమర్థవంతంగా నడిపే బాధ్యత స్పీకర్ పై ఉ ంటుందని అన్నారు. అలాగే విపక్షాలు ఆందోళన చేసినా ప్రభుత్వం సమన్వయంతో సభను నడిపించేలా చూడాలని కానీ దురదృష్టవశాత్తు ఈరోజుల్లో కొందరు సభను ఎలా వాయిదా వేయాలా అనే విధంగా చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. మాక్ అ ా ం బ్లీ ని స్ఫూర్తిదాయకంగా నిర్వహించిన మీ అందరినీ అభినందిస్తున్నానని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, అగ్రికల్చర్ రెవల్యూషన్ తీసుకొచ్చారని, వారి వల్లే మనకు సమాజంలో ఇవాళ అవకాశాలు వచ్చాయని ఈసందర్భంగా గుర్తు చేసుకున్నారు. దేశంలో నిర్బంధ విద్య అమలు చేసేందుకు సోనియా గాంధీ, మన్మోహన్ ఎంతో సింగ్ కృషి చేశారని 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు ను అందుబాటులోకి తీసుకొ చ్చిన ఘనత రాజీవ్ గాంధీ గారిది అని ప్రశంసించారు. ఇక ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేసేందుకు 25 ఏళ్ల వయసు నిబంధన ఉందని, 21 ఏళ్లు పూర్తి చేసుకున్న వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తే యువత రాజకీయాల్లోకి వచ్చే అవకా శం ఉంటుందని విద్యార్థులకి తెలిపారు. మాక్ అసెంబ్లీలో ఇలాంటి బిల్స్ ను పాస్ చేయడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# నాసిరకం భోజనం పెడితే జైలుకే!

మొదటి పేజీ తరువాయి



ఈ క్రమంలో విద్యార్థుల కలలను నిజం చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. 'రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానే కాదు.. దేశాన్ని ప్రపంచం ముందు గొప్పగా చూపించిన నేత అని,. నవీన భారత రూపశిల్పి నెహ్రూ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ టీచర్లకు ఉన్న అర్హత ప్రైవేటు ఉపాధ్యాయులకు లేదు. అయినా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు. ప్రభుత్వ బడుల ప్రతిష్ట పెంచే బాధ్యత టీచర్లదే. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యార్థులను కలిసి సమస్యలు తెలుసుకోవాలి. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నాం. అనుకున్న విధంగా బాలల దినోత్సవం రోజున ఉత్సవాలు ప్రారంభించాం అన్నారు. అధికారులు జిల్లాల్లో రెండు రోజుల పాటు పాఠశాలలను పర్యవేక్షించాలి. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలి. హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి అన్నం పెట్టాలి. దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకునేది లేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం. గత సీఎంను ఏనాడైనా మీరు చూశారా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఏనాడైనా చూశారా? ఈ రోజు మీ రేవంత్ అన్న మీతో చేయి కలిపాడా.. లేదా? దేశానికి ఆదర్శంగా ఉంటామని.. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలని సీఎం కోరారు. ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాల్లో ఇటీవల జరుగుతోన్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విద్యార్థులు తినే ఆహారంలో కల్తీ జరుగుతోంది. విద్యార్థులు తినే భోజనంలో పురుగులు, బల్లులు వస్తున్నాయి. ఇక నుండి హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టకపోతే జైలుకు పంపుతాం. విద్యార్థులకు గ్రీన్ ఛానెల్ ద్వారా కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలి. విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి ఆహారం పెట్టాలి. ముఖ్యమంత్రి, మంత్రులు తినే సన్న బియ్యమే గురుకులాల విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. ఎక్కడైనా విద్యార్థులకు దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకోం' అని సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని.. ఈ విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్ అన్నారు. ఇందులోనే కాబోయే ఇంజనీర్లు, డాక్టర్లు, ముఖ్యమంత్రులు ఉన్నారన్నారు. ఈ వేదికగా మీ కళల్ని ప్రదర్శించే అవకాశం నాడు ఇచ్చారా..? కానీ మీ రేవంత్ అన్న మిమ్మల్ని కలుసుకున్నాడు.. మీతో ఉన్నాడని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫామ్ హౌస్‌లో పడుకున్న కేసీఆర్‌కు వినపడేలా విద్యార్థులు చప్పట్లు కొట్టాలని ఈ సందర్భంగా స్టూడెంట్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పండగ పేరుతో సారా బుడ్లతో దొరికిన వారికి శిక్ష తప్పదని పరోక్షంగా కేటీఆర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ముసుగులో గులాబీ గుండాల అరాచకం

మొదటి పేజీ తరువాయి

శ్రీనివాసరెడ్డి మీడియా తో మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఇదే పద్ధతి పాటించారా అని నిలదీశారు. రైతులను నష్టపెట్టాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశం కాదని మంత్రి పొంగులేటి అన్నారు. వారి సమస్యలను వినడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని తెలిపారు. రైతుల ముసుగులో అధికారులను చంపే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. లగచర్ల సంఘటను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని అన్నారు. ఈ రోజు అధికారులపై దాడి జరిగినట్లుగానే ..రేపు రాజకీయ నాయకులు, ప్రజలపై దాడి జరిగితే ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. వికారాబాద్ జిల్లాకు ఫస్ట్ మేజిస్ట్రేట్‌గా ఉన్న కలెక్టర్‌పైనే హత్యాయత్నం చేయడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. అధికారుల మీద దాడి జరగడం మనమీద మనం దాడి చేసుకునట్లేనని అన్నారు. ఏం తప్పుచేశారని ఆనాడు ఖమ్మంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేసి జైల్లో పెట్టారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లో రైతులను దేశద్రోహులుగా చిత్రీకరించారని ఆరోపించారు. పిల్లా, పాపా, ముసలి అనే తేడా లేకుండా రాత్రికి రాత్రి వారిని అరెస్ట్ చేసి సంకెళ్లు వేసిన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో దళితులకు బేడీలు వేసిన సంగతి మరిచిపోయారా అని నిలదీశారు. లగచర్లలో ఆ పరిస్థితి లేదు కదా అని మంత్ర పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు.

# కాంగ్రెస్ పాలనపై మావోయిస్టుల లేఖ

### హామీలను మర్చి పాలనసాగిస్తుందని మండిపాటు

హైదరాబాద్,నవంబర్ 14: కాంగ్రెస్ సంవత్సర పాలనపై మావోయిస్టుల లేఖ రాయడం సంచలంగా మారింది. రేవంత్ రెడ్డి బుల్డోజర్ పాలనపై మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ బహిరంగ లేఖను విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, కార్పోరేట్ల కోసం పనిచేస్తుందని మండిపడ్డారు. పౌరుల ప్రాథమిక హక్కులను హరించి వేస్తూ హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పేరుతో విధ్వంసానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు రైతుల భూములను కొల్లగొట్టేందుకు పథకం పన్నారని విమర్శించారు. కుట్ర పూరితంగా కార్పొరేట్లకు మేలు చేసేలా రేవంత్ పాలన ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరే విధానలపై ఉద్యమించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# తాను ఎలాంటి వాంగ్మూలం ఇవ్వలేదు

### హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన పట్నం

**హైదరాబాద్, నవంబర్ 14 : తనపై** నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ లగచర్ల ఘటనలో ఏ1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ప్రభుత్వాధికారులపై దాడి కేసులో చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నరేందర్ రెడ్డిని గురువారం న్యాయవాదులు కలిశారు. వారి ద్వారా కోర్టుకు నరేందరెడ్డి అఫిడవిట్ పంపించారు. నేను పోలీసులకు ఎలాంటి వాగ్మూలం ఇవ్వలేదు. రిమాండ్ రిపోర్టులో పోలీసులు చెప్పినవన్నీ నిజం కాదు. నా స్టేట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకొని విచారణ చేయాలి' అని కోర్టుకు పంపించిన అఫిడవిట్‌లో నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం కేబీఆర్ పార్క్ వద్ద మార్నింగ్ వాక్ చేస్తున్న సమయంలో తనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా కారులో ఎక్కించి వికారాబాద్ డీటీసీకి తీసుకెళ్లారు. ఆ సమయంలో పోలీసులు నా స్టేట్‌మెంట్ తీసుకోలేదు. కోర్టులో హాజరుపరిచే 10 నిమిషాల ముందు కొన్ని పేపర్లపై నా సంతకాలు తీసుకున్నారు. నన్ను అక్రమంగా ఈ కేసులో ఇరికించారు. అరెస్టుకి ముందు నాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. కేటీఆర్ సహా ఇతర ముఖ్యనేతల అదేశాలతో దాడులు చేయించినట్లు పోలీసులు కట్టుకథ చెప్పారు. మరో వైపు నరేందర్‌రెడ్డిని 7 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు వికారాబాద్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారణ జరగనుంది.

# లైఫ్ సైన్సెస్ కేంద్రంగా హైదరాబాద్

### ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**హైదరారాబాద్, నవంబర్ 14** : తెలంగాణ రాజధాని హైదరాబాద్ లైఫ్ సైన్స్‌కి హబ్‌గా మారిపోయిందని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. లైఫ్ సైన్సెస్ సెక్టార్‌లో గత 10 నెలల్లో 140 ప్రాజెక్ట్స్ వచ్చాయని.. రూ.36000 కోట్ల ఇన్వెస్ట్మెంట్స్ తీసుకొచ్చామని తెలిపారు. దీనివల్ల 51,000ల మందికి ప్రత్యక్ష ఉపాధి, 1.5 లక్షల మందికి పరోక్షణగా ఉ పాధి లభించనుందన్నారు. ప్రభుత్వం మారినా పథకాలను కొనసాగిస్తూ.. మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. జీనోమి వ్యాలీ థర్డ్ ఫేజ్‌లో భాగంగా రాష్ట్రానికి భారీ కంపెనీలు వస్తున్నాయని.. యూరోపియన్‌కి చెందిన క్రికా సంస్థ రూ.2000 కోట్లతో తమ ప్లాంట్‌ని ఏర్పాటుచేయ-ఐబోతుందని తెలిపారు. దీని ద్వారా 2800 మందికి ఉ ద్యోగాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. జీనోమి వ్యాలీలో ఏడాదికి 5 కోట్ల డెంగ్యూ వాక్సిన్‌లు ప్రొడ్యూస్ చేయ-ఐబోతున్నారని వెల్లడించారు. వరల్డ్ లీడింగ్ బొయిటెక్నాలజీ కంపెనీ ఒపఐని కూడా తమ సెంటర్‌ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోతుందని.. తద్వారా 3000 వేల మందికి ఉ ద్యోగావకాశాలు దక్కనున్నాయని తెలిపారు.

# హైకోర్టును తప్పుదోవ పట్టిస్తున్న రేవంత్



- ఫార్మా భూమి అని చెప్పి.. ఫోర్త్ సిటీ కోసం యత్నం
- లగచర్ల ఘటనతో రైతుల ఆగ్రహం బయటపడింది
- మీడియా సమావేశంలో కెటిఆర్

**హైదరాబాద్, నవంబర్ 14** :తెలంగాణ హైకోర్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో భూముల ధరలు తగ్గాయని చెప్పారు. కాంగ్రెస్ మిగతా నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. లగచర్లలో ఉంది ఫార్మా భూమి అని హైకోర్టు కోర్ట్‌కు సీఎం రేవంత్ అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. బయటకు వచ్చి ఫోర్త్ సిటీ అంటున్నారని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో గురువారంమీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ భవన్‌కు లగచర్ల భూసేకరణ గిరిజన కుటుంబాలు చేరుకున్నాయి. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉంటానని కేటీఆర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి సీట్ కోసం మంత్రులు ఎదురుచూస్తున్నారని కేటీఆర్ విమర్శలు చేశారు. నల్గొండ ,ఖమ్మం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి , మల్లు భట్టి విక్రమార్క సీఎం చైర్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ముందుగా తన సీట్ పోకుండా రేవంత్ రెడ్డి చూసుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో భూముల ధరలు పెరిగాయని అన్నారు. ఏమైనా అభివృద్ధి చేస్తారేమోనని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. 'లగుచర్ల ఇష్యూతో సర్కారు బంగపడింది. లగచర్లలో అరెస్టు అయిన వారిని పోలీసులు తీవ్రంగా కొట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలను వదిలి పెట్టి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేశారు . పోలీసులు ఘోరంగా ప్రవర్తిస్తున్నారు. మా నాయకుడు సురేష్ తప్పేం చేశారు. నరేందర్ రెడ్డినీ ఎందుకు అరెస్టు చేశారు. నాలుగేళ్లలో మేమే అధికారంలోకి వస్తాం. ఆంధ్రలో ఏం జరిగిందో తెలంగాణలో అదే జరుగుతది. బీఆర్ఎస్ నేతలపై బోగస్ కేసులు పెడుతున్నారు. అధికారులకు అంత స్వామి భక్తి పనికి రాదు. రేవంత్ పిచ్చోడు.. అసలు వదలం. బాధితులను ఢిల్లీకి తీసుకెళ్తాం. నేషనల్ హెచ్ఆర్‌సీలో ఫిర్యాదు చేస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు.

# ఢిల్లీని కమ్మేసిన పొగ

**న్యూఢిల్లీ, నవంబర్ 14** :దేశ రాజధానిలో పరిస్థితులు మరింత దారుణంగా మారాయి. వాయి కాలుష్యం వల్ల ఉదయం 9 గంటలకూ కూడా సూర్యుడు కనిపించని పరిస్థితి ఉందంటే అక్కడ పరిస్థితులు ఏలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం.. ఆనంద్ విహార్ ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 473గా నమోదైంది. గురువారం ఉదయం రాజధాని ప్రాంతాన్ని దట్టమైన పొగ మంచు కమ్మేసింది. ఫలితంగా విజిబిలిటీ సున్నాకి పడిపోయింది. రోడ్లపై వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఉదయం 9 గంటల సమయంలోనూ సూర్యుడు కనిపించని పరిస్థితి. విజిబిలిటీ జీరోకు పడిపోవడంతో విమాన, రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషన్ ఎయిర్ పోర్ట్‌కు రాకపోకలు సాగించే సుమారు 300కి పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఫ్లైట్ రాడార్ 24 సంస్థ తెలిపింది. మరికొన్నింటిని దారి మళ్లించినట్లు పేర్కొంది. మొత్తం ఢిల్లీకి రావాల్సిన 115 విమానాలు, రాజధాని నుంచి బయలుదేరాల్సిన 226 విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నట్లు ఫ్లైట్ రాడార్ 24 సంస్థ తెలిపింది. సగటున 17 నుంచి 54 నిమిషాలు ఆలస్యంగా విమానాలు నడుస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు ఈ పొగమంచు రైళ్ల రాకపోలకపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.



# ఎన్ని రోజులు అరెస్టు చేయిస్తాడో మేమూ చూస్తాం

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ పగ ప్రతీకారంతో పట్నంను కుట్రపూరితంగా నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని ఆరోపిం చారు. కొడంగల్ నుంచే ప్రజాపాలన మీద తిరుగుబాటు మొదలైం దని.. ఈ అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మీకు ఓటేస్తే మేలు జరుగుతుందనుకుంటే పాపానికి.. లగచర్ల గ్రామం భూములను గుంజుకోవడమే నువ్వు చేసే మేలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. ఎక్కడ ఏం జరిగినా బీఆర్ఎస్‌పై పెడుతున్నారన్నారు. నిరుద్యోగులు, రైతులు, పోలీసులు స్వచ్ఛందంగా ధర్నా చేస్తే అది బీఆర్ఎస్ చేయించిందని రేవంత్ అంటున్నారని.. రేవంత్ సొంత నియోజకవర్గంలో తమ భూముల కోసం గిరిజనులు పోరాటం చేస్తే అది కూడా బీఆర్ఎస్ చేసిందనే అంటున్నారన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడడం ప్రతిపక్షాలుగా మా బాధ్యత అన్నారు. మమ్మల్ని అక్రమంగా కేసులు పెట్టాలనుకుంటున్నావేమో .. మాపై కోపం ఉంటే మమ్మల్ని అరెస్ట్ చేయండి.. కానీ అమాయక గిరిజన రైతులపై కేసులెలా పెడతారని సీఎంని ప్రశ్నించారు. వెంటనే గిరిజన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా ..? ప్రజాస్వామ్యమెక్కడుంది అంటూ నిలదీశారు.మల్లన్నసాగర్‌లో రేవంత్ రెండురోజులు నిరసన చేస్తే మేం అడ్డుకున్నమా.. ? అని ప్రశ్నించారు. అర్ధరాత్రి మహిళల చాతిమీద కాళ్లు పెట్టి అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఈ ప్రజల తిరుగుబాటు ఆగదని.. రేవంత్‌ని గద్దె దించే దాకా నిద్రపోమన్నారు. మా ప్రభుత్వంలో 14వేల ఎకరాలు ఫార్మాసిటీ కోసం సేకరించామని.. అక్కడెందుకు ఫార్మాసిటీ కట్టరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ముసుగులో దళితుల, గిరిజనుల భూములు గుంజుకుంటున్నారని.. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన ఇప్పుడు కనిపిస్తోందన్నారు. రైతుల భూములు గుంజుకోవడమే ఇందిరమ్మ పాలన అని నిలదీశారు. రేవంత్ పాలన అదానీ, తమ్ముళ్లు, అల్లుళ్ల కోసమేనని.. బీఆర్ఎస్ పార్టీ దళిత, గిరిజనుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. కేటీఆర్‌పై సైతం కుట్రలు చేస్తున్నారని.. ఆ రోజు మల్లన్నసాగర్‌లో నీ మీద కేసులు పెట్టినమా అంటూ సీఎం రేవంత్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్దంగా వ్యవహరించామని.. నరేందర్ రెడ్డికి ఏ సంబంధం లేదన్నారు. రిమాండ్ రిపోర్ట్‌లో ఏముందో తెలియదని.. మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడానికి ఒక్క నిముషం ముందు ఒత్తిడి చేసి నరేందర్‌రెడ్డితో సంతకం చేయించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి బడాబాబులపై ప్రేమ ఉందన్నారు. నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారని.. ఆయనకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. ధర్మమే గెలుస్తుందని.. న్యాయస్థానంలో న్యాయం జరుగుతుందన్నారు. ఆయన నిర్దోషిగా బయటకు వస్తారన్నారు.

# ఇలాంటి ప్రభుత్వాన్ని చూడలేదు..

## లగచర్ల భూసేకరణపై ఎంపీ ఈటల రాజేందర్‌ఫైర్



హైదరాబాద్, నవంబర్14: ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదని మల్కాజిగిరి ఎంపీ రాజేందర్‌ఫైర్ అయ్యారు. గురువారం నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మా కంపెనీల ఏర్పాటు పేరిట లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచర్ల పరిధిలో సుమారు 1350 ఎకరాలతో పాటు మరో 1500 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించాలని ఆలోచన చేస్తున్నట్లు స్థానిక ప్రజలు భావిస్తున్నారన్నారు. కొంతమంది దళారులు, మధ్యవర్తులు అసైన్డ్ భూములు పొందిన వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారని, మరికొంత మంది పట్టా భూములు కలిగి ఉన్నవారి నుంచి బలవంతంగా భూములు సేకరించాలని ప్రయత్నం చేసిందన్నారు. భూమినే నమ్ముకుని బతుకుతున్న రైతుల నుంచి రూ.40 లక్షల విలువైన భూమిని కేవలం రూ.10 లక్షలకే గుంజుకునే ప్రయత్నం చేశారన్నారు. స్థానిక ప్రజలు తమ గ్రామాలను వదిలిపెట్టే ప్రసక్తి లేదంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ముఖ్యమంత్రి అహంకారంతో ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో కలెక్టర్‌ను పంపించగా.. ప్రజలు నిరసన తెలిపారని చెప్పారు. స్వయాన కలెక్టర్ గారు తమపై దాడి చేయలేదని ప్రకటించారని గుర్తు చేశారు. అయినా 1500 మంది పోలీసులు 4 గ్రామాలపై పడి రాత్రికి రాత్రి కొంతమందిని అరెస్ట్ చేసి హింసించారన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు బంద్ పెట్టి.. యుద్ధభూమిని తలపించేలా ఓట్లేసి గెలిపించిన ప్రజలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హింసిస్తున్నారన్నారు. బాధిత ప్రజలు, రైతులకు మద్దతుగా వెళ్లిన ఎంపీ డీకే అరుణను పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేశారని, ముఖ్యమంత్రి సోదరుడిని మాత్రం 50 కార్ల కాన్వాయ్ తో, 300 మందితో పల్లెల్లో తిరుగుతూ, ప్రజలను దూషిస్తూ సంతకాలు పెట్టకుంటే జైళ్లలో మగ్గే పరిస్థితి వస్తుందని భయపెట్టారన్నారు. అధికారులు సైతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బానిసలుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 'గతంలో ముచ్చర్లలో ఫార్మాసిటీ కోసం హెలికాప్టర్లతో సర్వే చేశారు. రైతుల నుంచి కోట్లాది రూపాయల విలువైన 14 వేల ఎకరాల భూమిని సేకరించారు. ఆఖరుకు ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం వినియోగించుకున్నరు. కాంగ్రెస్ పాలనలో అధికారమదంతో ప్రజల భూములు గుంజుకుంటూ, హైడ్రా పేరుతో ఇండ్లు కూలగొడుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గం. రాష్ట్ర ప్రభుత్వం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ఇండ్లు కూలగొడుతోంది. మూసీ ప్రక్షాళన పేరుతో వేలకోట్ల దందా చేస్తున్నరు. గతంలో జీఎంఆర్ ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం విలువైన భూములిచ్చిన రైతులు, ప్రజలకు టాయిలెట్లు శుభ్రం చేస్తూ, అడ్డమీది కూలీలుగా దుర్భరమైన జీవితాలు గడుతుపున్నరు. బాసుల ఆదేశాల కోసం, వారి ప్రేమను పొందాలనుకోవడం కోసం ప్రజలను ఇబ్బంది పెట్టాలనుకోవడం మంచిదికాదని అధికారులను హెచ్చరిస్తున్నం' అని అన్నారు. 'భూములు తీసుకోవడానికి వస్తే అధికారులను తన్ని తరమండంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి రాగానే ప్రజల భూములను గుంజుకుంటున్నరు. డ్రగ్, కెమికల్ కంపెనీలకు పేద ప్రజల భూములతో ఏం సంబంధం..? అతితక్కువ ధరకు భూములు కొట్టేయాలనుకోవడం తగదు' అని హితవు పలికారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం గిరిజనులు, దళితులకు సంబంధించిన లక్షల ఎకరాల భూములను ప్రాజెక్టుల పేరుతో గుంజుకొని వారి ఉసురుపోసుకున్నది. నేడు రేవంత్ ప్రభుత్వం అట్లనే వ్యవహరిస్తున్నది. తమ భూములు గుంజుకోవద్దని అడ్డుకున్న పాపానికి రైతులకు బేడీలు వేసి, కేసులు పెట్టిన పాపం సీఎం రేవంత్ రెడ్డిది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాప్రతినిధులను కూడా బాధిత ప్రజలకు దగ్గరకు వెళ్లకుండా అడ్డుకుంటూ భూములు గుంజుకునే ప్రయత్నం చేస్తున్నది. ప్రజల నుంచి ప్రభుత్వం భూములు సేకరించాలనుకున్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలి కదా..! పేద ప్రజలు, రైతుల పక్షాన బిజెపి అండగా ఉంటుంది. తెలంగాణ ప్రజానీకం అండగా నిలుస్తుంది. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధులు దీలీప్ ఆచారి, సునీత, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఫేక్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠా అరెస్ట్

**హైదరాబాద్,నవంబర్14** : ఫేక్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠాను నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ ఓటర్ కార్డులు, ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మహంకాళి పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి వందల సంఖ్యలో ఫేక్ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా హైదరాబాద్ నగరానికి చెందిన వారిగా గుర్తించామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ముఠా సభ్యులు ఫేక్ సర్టిఫికెట్లతో పాస్‌పోర్ట్‌లు సృష్టించి పలువురిని విదేశాలకు పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే వీరి వద్ద కొందరు యువతీ, యువకులు పాస్‌పోర్టులు తీసుకున్నారని తెలిపారు. నిందితుల నుంచి వందలాది ఓటర్ కార్డులు, ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. గెజిటెడ్ ఆఫీసర్ల పేర్లతో నకిలీ స్టాంప్‌లు సృష్టించారని వాటినీ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను ఎలగం రాజ్ కుమార్, మహబూబ్, రాచమల్ల విజయలక్ష్మి, కూరపాటి పల్లవి, బండి శంకర్, గిరిరాజ్ అనిల్ కుమార్‌గా గుర్తించామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. పట్టుకున్న ఆరుగురు నిందితుల నుంచి ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేసే మిషన్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. అలాగే ఆరుగురినీ అరెస్టు చేశామని నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

# అక్రమ సంబంధంపై ఆగ్రహం

## భర్తను అడ్డు తొలగించుకునేందుకు హత్య

**నాగర్‌కర్నూల్, నవంబర్ 14** : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని మహాత్మగాంధీ కాలనీ తండాలో పొలం వద్ద రాజునాయక్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులకు విచారణలో విస్తుపోయే విషయాలు తెలిశాయి. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని అతని భార్య ప్రియునితో కలిసి భర్తను చంపించినట్లు తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాత్మాగాంధీ కాలనీ తండాకు చెందిన రాజునాయక్ అదే తండాకు చెందిన హిమబిందును తొమ్మిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ బాబు, పాప సంతానం. ఇలా సాగుతున్న క్రమంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం క్లళెంచెరువు తండాకు చెందిన చంటి.. మహాత్మాగాంధీ కాలనీ తండాలో తన మేనమామ ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలోనే హిమబిందుతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఏడాదిగా వీరి తతంగం నడుస్తుండగా.. ఈ విషయం భర్త రాజునాయక్‌కు తెలిసి ఇద్దరినీ తీవ్రంగా మందలించాడు. దీంతో తన భర్తను అడ్డు తొలగించుకోవాలని హిమబింధు భావించింది. ఈ నెల 7న రాజునాయక్ వేరుశనగ తోటలో ఉండగా.. ప్రియుడి చంటి, అతని స్నేహితుడు రాకేశ్, హిమబిందు కలిసి అతనిపై సుత్తితో దాడి చేసి చంపేశారు. మృతదేహాన్ని కొద్దిదూరంలో పడేశారు. తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం దుర్మార్గం

## మీడియా సమావేశంలో మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




**న్యూఢిల్లీ,నవంబర్14** :తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్ తదితరులపై మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉండగా ప్రధాన మంత్రి రాష్ట్రానికి వస్తే స్వాగతం పలకలేని మొఖాలు ఇవాళ మేమేం చేయాలో చెప్తయా.. అని కిషన్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ సర్టిఫికేట్ మాకు అక్కర్లేదని అన్నారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని విమర్శించారు. అందుకే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం చేస్తోందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని... గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా లీగల్ ఒపీనియన్ తీసుకోవాల్సి ఉంటుందని ఈ క్రమంలో కొంత జాప్యం జరిగితే తొందరపాటుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, అంతమాత్రాన బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే చెప్పడం అవివేకమని కిషన్ రెడ్డి అన్నారు. అవినీతి ఎక్కడ జరిగినా విచారణ జరపాలన్నది తమ డిమాండ్ అని అన్నారు. కాళేశ్వరం మీద సీబీఐ విచారణకు డిమాండ్ చేశామని, సీఎం రేవంత్ రెడ్డి విచారణ కోరారా.. అని ప్రశ్నించారు. గవర్నర్ నిర్ణయం తీసుకోవాలంటే లీగల్ ఒపీనియన్ అనేది ఉంటుందని చెప్పారు. అమృత్ టెండర్లపై జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ తామే కోర్టుకు వెళ్లామని గుర్తు చేశారు. ప్రజలతో తప్ప ఏ పార్టీతో బీజేపీ ములాఖత్ కాలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. వైఫల్యాలను, అసమర్ధత నుంచి దృష్టి మళ్లించేందుకు రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని, కేటీఆర్, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు తమకు అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి ప్రాజెక్టులు ప్రారంభించడానికి వస్తే బయటకు రాని కేసీఆర్, కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. కలెక్టర్ మీద దాడి తప్పు అని.. కానీ గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టడం కూడా సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటన అని, ఆయన తన ప్రజలతో మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని, ఒక్క అవినీతి, కుంభకోణం ఆరోపణ లేకుండా బీజేపీ, శివసేన ప్రభుత్వ పాలన సాగిందని కిషన్ రెడ్డి అన్నారు. బొగ్గు పరిశ్రమలో ప్రమాదాలు లేకుండా కార్మికుల క్షేమమే ప్రధాన ఎజెండాగా కార్యక్రమాలు రూపొందించామన్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ వరకు కోల్ ఇండియా ఫౌండేషన్ డే ఉత్సవాలు నిర్వహిస్తామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో కాబిల్ సంస్థను ఏర్పాటు చేశామని, ఇది వివిధ దేశాలు సందర్శించి లిథియం నిక్షేపాల వెలికితీత గురించి తెలుసుకుంటుందన్నారు. సముద్రగర్భంలో ఉన్న ఖనిజాల వెలికితీత గురించి వేలం పక్రియ నిర్వహిస్తామని, లిథియం విషయంలో ఆస్ట్రేలియా, అమెరికా, అరబ్ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని కిషన్ రెడ్డి తెలిపారు.

విశ్వ సారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్

# జనగణన.. ప్రధాన సమస్యలు !

శీతాకాల పార్లమెంట్ సమావేశాలు త్వరలోనే జరుగనున్నాయి. ఈ సమావేశాల్లోనే జమిలి ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే జమిలి ఫీవర్ పట్టుకుంది. జమిలి ఎన్నికలు జరిపి తీరుతామన్న పట్టుదలలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం అని విపక్షాలు ఇప్పటికే వాదిస్తున్నాయి. ఎందుకంటే వారిని నిరంతర ఎన్నికల ప్రక్రియ ఉంటేనే జీవితం గగడవదు. అయితే జమిలి ఎన్నికలతో వచ్చే నష్టం లేదు. తరచూ ఎన్నికల వల్ల దేశ ఖజానాకు బొక్క పడుతోంది. అలాగే రాజకీయ నాయకులు నిత్యం ఎన్నికలతో ఎంజాయ్ చేస్తున్నారు. దీంతో ప్రజా సమస్యలు ఎన్నికల గాలికి కొట్టుకు పోతున్నాయి. దేశాన్ని గాడిలో పెట్టాలంటే పలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఇవన్నీ మోడీ ప్రభుత్వం చేయగలుగుతుందా..అంతటి చిత్తశుద్ధి ఉందా అన్నది చూడాలి. ప్రధానంగా జమిలికి ముందే దేశ జనాభా గణన జరగాలి. దీంతోపాటే ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి తీసుకుని రావాలి. ఎవరెన్ని రకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా, రాజకీయ పోరాటం చేసినా..దేశానికంతటికీ ఒకేదేశం, ఒకే చట్టం అమల్లోకి రావాలి. అలాగే ప్రధానంగా పెరుగుతున్న జనాభాను కట్టడి చేయాలి. ఇందులో కులమతాలకు తావులేకుండా చేయాలి. ఇవి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. అలాగే కాంగ్రెస్ పార్టీ కులగణనతో దేశంలో విభజన రాజకీయాలు చేస్తోంది. దీనిపైనా స్పష్టత రావాల్సి ఉంది. కులాలను పక్కన పెట్టేలా కఠిన రాజ్యాంగ చర్యలకు ఉపక్ర మించాలి. కులాల పేరుతో దేశాన్ని చీల్చే ప్రక్రియ సరైనది కాదు. ఆధునిక సమాజంలో ఇంకా కులాలను పట్టుకుని వేళ్లాడడం కూడా అంతమంచిది కాదు. ప్రజల్లో ఆడా,మగా, ఉన్నవారు, లేని వారు అన్న విభజన రేఖలు మాత్రమే ఉండాలి. వాటి ఆధారంగానే అన్ని రకాల ప్రయోజనాలు,




కార్యక్రమాలు అమలు కావాలి. మొత్తంగా పదేళ్లుగా ఈ అంశాలపై ఊరిస్తూ వచ్చిన మోడీ ఇప్పటికైనా కఠిన నిర్ణయాలతో ముందుకు సాగితేనే దేశంలో అలజడి లేకుండా ప్రశాంతంగా సాగగలదు. జనాభ నియంత్రణ కేవలం హిందువులకే అన్న పద్ధతిలో సాగడం మంచిపద్ధతి కాదు. ఇకపోతే జమిలి ఎన్నికలకు ముందే జనాభా గణన చేపట్టాలి. దేశంలో ఆరోవేలుగా ఉన్న గవర్నర్ వ్యవస్థలను రద్దు చేయాలి. పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. ఎంపిటిసిలు, జడ్పీటిసీల వ్యవస్థలను ఎత్తేయాలి. పంచాయితీలకే గ్రామాల అభివృద్ధి బాధ్యతను చట్టబద్ధంగా అప్పగించాలి. కేంద్రం నిధులు విడుదల చేస్తున్నా..అవి సక్రమంగా వినియోగించడం లేదు. దీంతో గ్రామాలు ఏమాత్రం అభివృద్ధి చెందకుండా వట్టి పోతున్నాయి. ఇకపోతే వచ్చే ఏడాది జనగణన ప్రక్రియను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. అందులో ఒకటి మహిళా రిజర్వేషన్ చట్టం కాగా, రెండోది లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల నియోజకవర్గాల సంఖ్య జనాభా ప్రాతిపదికన నిర్ణయిస్తారు. దేశంలో భిన్నత్వాన్ని, ప్రజాస్వామి క స్ఫూర్తిని చాటేలా చట్టసభల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభించేలా సీట్ల కేటాయింపు ఉంటుంది. దేశ, రాష్ట్ర జనాభాను పరిగణనలోకి తీసుకొని లోక్‌సభ సీట్లసంఖ్యను నిర్ణయిస్తారు. కొత్తగా లెక్కించే జనాభా ఆధారంగా శాసనసభ,లోక్‌సభ సీట్లు పెరుగుతాయని రాజకీయవర్గాలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. సీట్లు పెరిగితే తమకు ప్రాతినిధ్యం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే రాజకీయ పదవులను తగ్గించే పని కూడా చేపడితే మంచిది. రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థతో పాటు శాసనమండలులు కేవలం రాజకీయ పునరావాస కేంద్రాలుగా ఉన్నాయి. వీటిని శాశ్వతంగా ఎత్తేస్తే మంచిది. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు మాత్రమే పరిమితం కాకుండా లోక్‌సభ, శాసనసభల సీట్ల సంఖ్యను

కూడా పెంచాలని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయి. ఎందుకంటే ఎన్ని సీట్లు పెంచితే అన్ని విధాలుగా లబ్ది పొందేది కేవలం రాకజీయ పార్టీలు మాత్రమే. దేశంలో లోక్‌సభ సీట్లను పెంచితే మాత్రం దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. అందుకే దేశ ప్రజల దృష్టి 2025లో జరగనున్న జనాభా లెక్కలపై పడింది. ఇకపోతే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాన్ని ఆమోదించారు. దీనికి జనాభగణను లింక్ చేశారు.మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో జనగణన కీలకంగా ఉంది. 2023లో ఈ బిల్లు 106వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టంగా మారింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం జనగణన పూర్తయిన వెంటనే దాన్ని అమల్లోకి తీసుకుని వస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు చట్టంలో కూడా పొందుపరిచింది. అందుకే, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రావాలంటే కచ్చితంగా జనగణన జరిగితీరాలి. అప్పుడే మహిళల దశాబ్దాల కల సాకారమవుతుంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు దక్కుతాయి. మహిళా రిజర్వేషన్ల ద్వారా దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన మహిళలు చట్టసభల్లోకి ప్రవేశించేం దుకు ఉన్న ఆటంకాలు తొలగిపోతాయి. మన దేశంలో చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. మళ్లీ 2021లో జనగణన జరగాల్సి ఉండగా, కరోనా కారణంగా వాయిదా పడింది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం 2025 మొదటి త్రైమాసికంలో జనగణన ప్రారంభం కానున్నది. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత, డిజిటల్ గవర్నెన్స్ వల్ల ఏడాదిలోగా ప్రక్రియ సమర్థవంతంగా పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. సకాలంలో జనగణన పూర్తయితే నియోజకవర్గాల పునర్విభజనకు కూడా మార్గం సుగమం అవుతుందన్నది రాజకీయ పార్టీల ఆశగా ఉంది. ఎలాగూ జనగణన తప్పదు కనుక అనేక కీలక అంశాలపైనా శాశ్వత నిర్ణయాలు తీసుకోవాల్సిన అసవరం ఉంది. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకుని అవసరమైన మేరకు రాజ్యాంగ సవరణలను ఆమోదించుకోవాలి. ఒకేదేశం ఒకేచట్టం ఇందులో ప్రధాన మైనది. జనాభా నియంత్రణ కూడా అంతే ప్రధానమైనది. వనరులు తగ్గిపోతున్న క్రమంలో జనాభా నియంత్రణ లేకుండా సాగితే దేశంలో అరాచకం ప్రబలే ఆస్కారం ఉంది. దీనిని గమనించి కేంద్రం చర్యలు తీసుకుంటే మంచిది.

# ఏపీ విభజన చట్టం మేరకు సీట్లు పెంచాల్సిందే

- పదేళ్లయినా నేటికీ అమలు కాని నియోజకవర్గాల పెంపు
- డీలిమిటేషన్ చేపడితే తప్ప న్యాయం జరగదన్న ధోరణి



**న్యూఢిల్లీ, నవంబర్ 14 :** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. ఈ మేరకు అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం హామీ కూడా ఇచ్చింది. అయితే విభజన హామీలన్నీ గాలికి పోయాయి.ఈ క్రమంలో ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. నియోజక వర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు తీసుకుంటే మంచిది. అయితే జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతు న్నాయి. 1973లో వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తి ప్రకారం సీట్లను కేటాయించారో ఆ విధంగానే ఇప్పుడు కూడా అలాంటి నియమాలు, నిబంధనలను పాటించాలని కోరుకుంటున్నాయి. ఒకవేళ లోక్‌సభ సీట్లు పెంచాల్సివచ్చినా అదే నిష్పత్తితో అన్ని రాష్ట్రాలకు సమంగా వర్తింప చేయాలని కూడా అంటున్నాయి. జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టాలి. లోక్‌సభ, శాసనసభల సీట్లకు సంబంధించి గ్రామీణ, నగర ప్రాంతాలను దృష్టిలో పెట్టుకోవాలి. నియోజకవర్గాల పునర్విభజన జరిగి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాలని సూచిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే కేంద్రంలోని మోదీ సర్కార్ జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటే మంచిది. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు. ఇప్పుడు జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యను కేటాయించాలని వారు వాదిస్తున్నారు.

# కార్తీక పౌర్ణమి రోజే దేవ దీపావళి

**వారణాసిలో గంగా హారతికి ప్రత్యేకం**



**వారణాసి, నవంబర్ 14 :** హిందూ మత విశ్వాసాల ప్రకారం సకల దేవతలు కార్తీక పూర్ణిమ రోజున దీపావళిని జరుపుకుంటారు, అందుకే ఈ రోజుని దేవ దీపావళి అంటారు. ఈ రోజున త్రిపురాసురుడు అనే రాక్షసుడిని శివుడు సంహరించిన సందర్భంగా దేవతలు స్వర్గంలో దీపాలు వెలిగించి జరుపుకున్నారని.. ఇప్పటికీ దేవతలు దీపాలను వెలిగిస్తారని.. భూమికి వస్తారని చెబుతారు. త్రిపురాసురుడిని సంహరించిన తర్వాత దేవతలందరూ స్వర్గంలో దీపావళి జరుపుకున్నారని నమ్ముతారు. అప్పటి నుంచి దేవ దీపావళి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది పండగలు పర్వదినాల జరుపుకునే విషయంలో గందరగోళం నెలకొంది. దీపావళి వలెనే దేవ దీపావళి పండగ కూడా హిందువులకు చాలా పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. దేవ దీపావళి రోజున గంగా హారతి నిర్వహిస్తారు. ఈ పండుగను ప్రతి సంవత్సరం కార్తీక మాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. ఈ పండుగ దీపావళి వెళ్ళిన 15వ రోజు వస్తుంది. పురాణాల ప్రకారం ఈ రోజున శివుడు త్రిపురాసు-రుడు అనే రాక్షసుడిని సంహరించాడు. ఈ రోజున పూజలు చేయడం, వేద మంత్రాలను పఠించడం వల్ల రెట్టింపు ఫలితాలు లభిస్తాయని చెబుతారు. ఈ పండుగ శివుని కుమారుడైన కార్తికేయుని జన్మ దినానికి చిహ్నంగా కూడా పరిగణించబడుతుంది. ఈ రోజున దేవతలు స్వర్గం నుంచి భూమికి వచ్చి తమ భక్తుల కష్టాలన్నింటినీ తొలగిస్తారని నమ్ముతారు. భారతదేశంలో దేవ దీపావళిని ప్రధానంగా వారణాసిలోని గంగా నది ఒడ్డున అత్యంత వైభవంగా జరుపుతారు. దేవ దీపావళి రోజున ఆచారాల ప్రకారం మహాదేవుని పూజించిన వ్యక్తి కోరుకున్న ఫలితాలను పొందుతారని చెబుతారు. అంతే కాకుండా మనసులో భయం కూడా మాయమవుతుంది. ఈ రోజు కార్తీక మాసం పౌర్ణమి తిథి కనుక ఈ రోజున చేసే స్నానం, దాన ధర్మాలు వలన పూర్వీకుల అనుగ్రహం కూడా లభిస్తుంది. కార్తీక పౌర్ణమి రోజున దేవ దీపావళి వేడుకలను ప్రదోష కాల సమయంలో సాయంత్రం 5:10 నుంచి 7:47 వరకు జరుపుకుంటారు. ఈ శుభ సమయంలో కాశీలోని గంగా ఘాట్ వద్ద దీపాలు వెలిగిస్తారు.

# కార్తీక పౌర్ణమికి పూజలు, వ్రతాలు

- నదీ, సముద్ర స్నానాలకు ప్రాముఖ్యం
- సాయంత్రం వేళ దీపాలు వెలగించడం ప్రత్యేకత

**తిరుమల,నవంబర్14 :** కార్తీక పౌర్ణమి హిందువులు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో ఒకటి. ఈ రోజున ఆకాశంలో చంద్రుడు పూర్తి ప్రకాశంతో ప్రకాశిస్తూ దర్శనం ఇస్తాడు. ఆ రోజు రాత్రి సమయంలో కూడా కాంతి వాతావరణం ఉంటుంది. అందుకే దీనిని దీపాల పండుగ అని కూడా అంటారు. కార్తీక పౌర్ణమి చాలా పవిత్రమైన పండుగగా పరిగణించబడుతుంది. ఈ రోజున విష్ణువు, శివుని పూజిస్తారు. ఈ రోజున పూజించడం దానం చేయడం వల్ల అనేక రెట్లు పుణ్యం లభిస్తుంది. ఈ రోజున కొన్ని ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వారా ఆశించిన ఫలితాలను పొందుతారు. ఈ రోజున స్నానం, దానం, పూజలు చేస్తే సర్వపాపాలు నశించి మోక్షం లభిస్తుందని విశ్వాసం. కార్తీక పౌర్ణమికు సంబంధించి అనేక పురాణ కథలు ఉన్నాయి. ఈ రోజున శ్రీకృష్ణుడు గీతా ప్రబోధించినట్లు ఓ నమ్మకం. భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో కార్తీక పూర్ణిమను వివిధ రకాలుగా జరుపుకుంటారు. ఈ రోజున ప్రజలు నదులలో స్నానాలు చేస్తారు, దీపాలు దానం చేస్తారు. ప్రత్యేక పూజలను చేస్తారు. ఈ రోజు దానం చేయడం వలన చాలా పుణ్యం లభిస్తుందని ఓ నమ్మకం. ఈ రోజున విష్ణువు లక్ష్మీదేవి లతో పాటు శివుడుని పూజిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున చంద్రుడు.. కుజుడు ఒకరి రాశిలో మరొకరు ఉంటారు. దీంతో ఈ రోజున అరుదైన యోగాలు ఏర్పడుతున్నాయి. కార్తీక పౌర్ణమి నాడు అర్ధరాత్రి గజకేసరి రాజయోగం ఏర్పడుతోంది. ఈ రోజున బుధాదిత్య రాజ్యయోగం కూడా ఏర్పడుతోంది. ఆ తర్వాత 30 ఏళ్ల తర్వాత కార్తీక పౌర్ణమి నాడు శశ రాజయోగం ఏర్పడుతుంది. శని 30 సంవత్సరాల తర్వాత కుంభరాశిలోకి ప్రవేశిస్తున్నాడు. అటువంటి పరిస్థితిలో కార్తీక పౌర్ణమి రోజున దానాలు చేసినా అనేక రకాల ఫలితాలు దక్కుతాయని నమ్మకం. కార్తీక పౌర్ణమి రోజున నదీ స్నానమాచరిస్తారు. నదీ తీరం వద్ద దీపాలు వెలిగిస్తారు. కార్తీక పూర్ణిమ రోజున దీపదానం చేయడం చాలా ప్రాముఖ్యత కలిగి ఉంది. ఈ రోజున నదిలో, చెరువులో దీపాలను విడిచి పెట్టడం వలన అన్ని రకాల సమస్యలు తొలగిపోయి రుణ విముక్తులు అవుతారని విశ్వాసం. కార్తీక పౌర్ణమి రోజున ఇంటి ప్రధాన ద్వారం వద్ద మామిడి ఆకులతో చేసిన తోరణం కట్టి, ఇంటి చుట్టూ దీపాలు వెలిగించడం వలన జీవితంలో కలిగే అడ్డంకులు తొలగి సంతోషంగా ఉంటారు.



# నేడు గురునానక్ జయంతి

**సిక్కు మతస్థులకు పరమపవిత్రం**

**న్యూఢిల్లీ, నవంబర్ 14 :** సిక్కులు జరుపుకునే అత్యంత ముఖ్యమైన పండుగలలో గురునానక్ జయంతి ఒకటి. ఈ పండుగను ప్రతి సంవత్సరం కార్తీక మాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. దీనిని 'గురుపర్వ' లేదా 'ప్రకాష్ పర్వ' అని కూడా అంటారు. సిక్కు మతాన్ని స్థాపించిన గురునానక్ దేవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ పండుగను జరుపుకుంటారు. గురునానక్ దేవ్ జీ సిక్కు మతాన్ని స్థాపించాడు. ఇతను సిక్కు మతస్తుల మొదటి గురువు. గురు నానక్ జయంతి పండుగ సిక్కులకు చాలా ప్రత్యేకమైనది. ఈ పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఈ రోజున అన్ని గురుద్వారాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం గురునానక్ జయంతి పండుగను కార్తీక మాసం పౌర్ణమి రోజున జరుపుకుంటారు. ఈ సంవత్సరం కార్తీక మాసం పౌర్ణమి తిథి నవంబర్ 15వ తేదీన వచ్చింది కనుక గురునానక్ జయంతి శుక్రవారమే జరుపుకుంటారు. ఈ సంవత్సరం గురునానక్ 555వ జయంతిని జరుపుకోనున్నారు. గురునానక్ 1469వ సంవత్సరంలో కార్తీక పౌర్ణమి రోజున జన్మించారని.. అప్పటి నుంచి నేటి వరకు ఆయన జయంతిని ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున ఎంతో ఘనంగా జరుపుకుం టున్నారు. 'అఖండ మార్గం' గురునానక్ జయంతికి రెండు రోజుల ముందు నిర్వహించబడుతుంది. దీనిలో గురు గ్రంథ్ సాహిబ్ ను 48 గంటలపాటు నిరంతరం పఠిస్తారు. ఈ పఠనం గురునానక్ జయంతి రోజున ముగుస్తుంది. గురునానక్ జయంతి రోజున ఉదయం 'నగర కీర్తన' నిర్వహిస్తారు. నగర కీర్తనలో సిక్కులు షాబాద్ కీర్తనను పాడతారు. గురుగ్రంథ సాహిబ్‌ను ఊరేగింపులో తీసుకువెళతారు. ఈ రోజు గురుద్వారాల లో కీర్తనలు , ఉపన్యాసాలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఇక్కడ గురునానక్ దేవ్ జీ బోధనలను వినిపిస్తారు. ఇలా సిక్కులు తమ గురువు చెప్పిన సందేశాలను గుర్తు చేసుకుంటారు. వాటి నుంచి ప్రేరణ పొందుతారు. అలాగే గురుద్వారాలలో ప్రత్యేక లంగర్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో అన్ని మతాలు, కులాల ప్రజలు ఒకచోట కూర్చొని భోజనం చేస్తారు. లంగర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం సమానత్వం, సోదరభావం సందేశాన్ని అందించడం. ఈ సందర్భంగా కొన్ని చోట్ల దీపాలు వెలిగించి గురుద్వారాలను అలంకరిస్తారు. ఈ రోజున ప్రజలు పేదలకు ఆహారాన్ని అందిస్తారు. బట్టలు దానం చేయడం, సామాజిక సేవకు సంబంధించిన పనులు చేయడం వంటి సేవ, దానధర్మాలను కూడా చేస్తారు.గురునానక్ దేవ్ జీ ఎల్లప్పుడూ సమానత్వం, ప్రేమ, సేవ, నిజాయితీ సూత్రాలను ఉద్ఘాటించారు. ఈ రోజున ప్రజలు కుల, మతాలకు అతీతంగా అందరి పట్ల సోదరభావం, సహన స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించాడు. గురునానక్ దేవ్ జీ భగవంతుని నామాన్ని జపించండి, నిజాయితీగా పని చేయండి.. పేదవారికి పంచి అనంతరం తినండి అని చెప్పాడు. ఈ పండుగ నిస్వార్థ సేవా స్ఫూర్తిని, మానవత్వం గురించి అయన చెప్పిన విషయాలు జీవితంలో అనుసరించడానికి, అమలు చేయడానికి ఒక పవిత్ర సందర్భం.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్



## ఎస్సై కృష్ణ ప్రసాద్'కు ఘన సన్మానం చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీమ్

**వారధి న్యూస్ ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్ స్టేషన్'కి నూతనంగా వచ్చిన ఎస్సై కృష్ణ ప్రసాద్' ని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా'తో సన్మానించి హార్థిక శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యులు అచ్చునూరి కిషన్. ఈ కార్యక్రమంలో వాజేడు మండల తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యులు ముత్తబోయిన ప్రసాద్, బొల్లె రమేష్, కాళేశ్వరపు సంతోష్, గారె విక్రమ్, తోలెం సంతోష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 18న తెలంగాణ డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ పర్యటన

- జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి ప్రకటన

**వారధి న్యూస్, వనపర్తి ప్రతినిధి :** మహబూబ్ నగర్ జిల్లా ఐడీఓసీలో ఈనెల 18వ తేదీ సోమవారం ఉదయం 10:30కి తెలంగాణ డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ శ్రీ బి. వెంకటేశ్వరరావు ఐఏఎస్ (రిటైర్డ్) ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని వనపర్తి జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రజలు, తెలంగాణ డెడికేటెడ్ బీసీ కమిషన్ బృందానికి తమ సమస్యలు, అవసరాలపై అభిప్రాయాలు, రిజర్వేషన్లు, దామాషా, వాదనలు, సలహాలు మరియు సూచనలను తెలియజేయాలని ఆయన సూచించారు. తెలంగాణ డెడికేటెడ్ బీసీ కమిషన్ బృందం, బీసీలకు స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లు, దామాషా విషయాలను క్షేత్రస్థాయిలో స్వయంగా తెలుసుకోవడానికి పర్యటిస్తున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలోని వివిధ సామాజిక వర్గాల ప్రజా ప్రతినిధులు, ఆసక్తి ఉన్నవారు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా తెలంగాణ డెడికేటెడ్ బీసీ కమిషన్ బృందానికి అందించవచ్చునని సూచించారు.



## ధాన్యం కొనుగోళ్ళు చేయాలని రాస్తారోకో

**వారధి న్యూస్ , నిర్మల్:** ధాన్యం కొనుగోలు చేయటంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యానికి నిరసనగా నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం అబ్దులాపూర్ గ్రామ రైతాంగం భైంసా - నిర్మల్ రహదారిపై గురువారం రాస్తారోకో నిర్వహించారు. గ్రామానికి దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో వందలాది వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు దాటుతున్నా ధాన్యాన్ని తూకం వేయటం లేదని, వేసిన ఆరు లారీల ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు పంపించినా తప్పులు, తాలు ఉన్నాయన్న వంకతో దింపటం లేదని రైతాంగం ఆరోపించింది. క్వింటా ధాన్యానికి అదనంగా 7 కిలోల ధాన్యం ఇచ్చినా ఇబ్బందులు తప్పడం లేదని ఆరోపించారు. ధాన్యం చేతికి వచ్చి నెల రోజులవుతున్నా కొనుగోళ్ళు ప్రారంభించనందుకు బుధవారం కుల గణన ను బహిష్కరించిన గ్రామస్తులు ఆందోళనకు దిగారు.



## బొంతపల్లిలో దారుణ హత్య

- పాత కక్షతో తల్లి కొడుకులను హతమర్చిన నిందితుడు

**వారధి న్యూస్,పటాన్ చేరు :** గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరభద్రనగర్ కాలనీలో తల్లి కొడుకును నడిరోడ్డుపై కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన నాగరాజు (30) బొంతపల్లి లోని వీరభద్రనగర్ లో నివాసం వుంటున్నాడు. రెండు సంవత్సరాల క్రితం వీరి కుమారుడు నీటి సంపులో పడి మృతి చెందాడు. వీరి ఇంటి ప్రక్కనే ఉత్తరప్రదేశ్ కి చెందిన సరోజ కుటుంబం నివాసం ఉంటుంది. తన కుమారుడి మృతికి కారణం తన ఇంటి పక్కనే వున్న సరోజ(50), అతని కుమారుడు అనీల్ (30) కారణమని భావించాడు నాగరాజు. అప్పటినుంచి నాగరాజు సరోజ, అనిల్ పై పగను పెంచుకున్నాడు. కాగా గురువారం ఉదయం ఇంట్లో నుండి తల్లి కొడులులు బయటకు రాగానే ఇదే అదునుగా భావించిన నాగరాజు తల్లి కొడుకును కత్తితో పొడిచి హత్య చేశాడు. తీవ్రమైన గాయాలతో రక్తపు మడుగుల మధ్య తల్లి అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని జిన్నారం సీఐ సుధీర్ కుమార్, గుమ్మడిదల ఎస్ఐ మహేశ్వర్ రెడ్డీలు పరిశీలించారు.



# గ్రూప్ 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** జిల్లాలో ఈనెల 17, 18 తేదీలలో జరగనున్న గ్రూప్ 3 పరీక్షలను పకడ్బందీ గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్.పి. రాములు తో కలిసి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్ష కొరకు జిల్లాలో 52 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. టి.జి.పి.ఎస్.సి జారీ చేసిన సూచనల మేరకు ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా ఫూల్ ప్రూఫ్ పద్ధతి తో నిర్వహించాలని అన్నారు. జిల్లా అధికారులను డిపార్టుమెంటల్ అధికారులుగా నియమించినట్లు,ఒక టీమ్ గా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో త్రాగునీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచుతూ వెలుతు-రు, ఫర్నిచర్, ఫ్యాన్లు ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, 144 సెక్షన్ అమలు చేస్తూ జిరాక్స్ సెంటర్లను మోసం జరుగుతుందని తెలిపారు. 17 వ తేదీన 2 సెషన్లు, 18న ఒక సెషన్ ఉంటాయని, పరీక్ష కేంద్రాలలో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ లకు అనుమతి ఉండదని, అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఆర్. టి. సి. అధికారులు సమయానుసారంగా బస్సులు నడిపించాలని, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల ప్రకారం నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అభ్యర్థులను మొదటి పేపర్ కు ఈ నెల 17వ తేదీన ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, రెండవ పేపర్ మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం పరీక్షకు 9.30 గంటలకు గేటు మూసివేయడం జరుగుతుందని, పరీక్ష సాగుతున్న సమయంలో ప్రతి అరగంటకు ఒకసారి షార్ట్ బెల్, పరీక్ష ముగిసే 5 నిమిషాల ముందు షార్ట్ బెల్, పరీక్ష ముగిసే సమయానికి లాంగ్ బెల్ మోగిస్తారని తెలిపారు. 18వ తేదీన ఒక పేపర్ ఉంటుందని, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, ఈ పేపర్ కు మొదటి రోజు ఉదయం పేపర్ నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. 9.30 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉండదని, అభ్యర్థులు ఈ సమయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ వెంట ఎలాంటి ఎలెక్ట్రానిక్ పరికరాలు, చేతి గడియారాలు, మొబైల్ లు తీసుకురాకూడదని తెలిపారు.



## దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- ఉద్యోగ జేఏసీ చైర్మన్ దొంత నరేందర్

**వారధి న్యూస్, మెదక్ బ్యూరో :** వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్ మరియు అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మెదక్ జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ దొంత నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టారు. విధి నిర్వహణలో ఉన్న ఉన్నత అధికారులపై రైతుల పేరిట కొందరు దాడి చేయడం సిగ్గుచేటు అని ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో వ్యక్తపరచాలి తప్ప రాళ్లతో కర్రలతో దాడులు చేయడం సమంజసం కాదని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్, ట్రెస, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మహేందర్ గౌడ్, పద్మారావు, కలెక్టరేట్ ఏవోలు యూనూస్, బలరాం, డి బి సి డివో నాగరాజు గౌడ్, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, జిల్లా సహ అధ్యక్షులు ఎండి ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు యండి ఫజులుద్దీన్, లీల, సంయుక్త కార్యదర్శి పోతురాజు శంకర్, టీఎన్జీవో ఏడుపాయల వనదుర్గ యూనిట్ కార్యదర్శి ప్రశాంత్, ట్రెస నాయకులు పరమేష్, నరేష్, ఇరిగేషన్ ఫోరం జిల్లా కార్యదర్శి శ్రీ హర్ష, ఉద్యోగులు సలీం, వెంకటేష్, సత్యనారాయణ, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీహెచ్ఎస్ వెలిజర్ల లో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

- విద్యార్థుల బంగారు భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్ద పడుతుంది

**వారధి న్యూస్, షాద్ నగర్:** వెలిజర్ల గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... విద్యార్థుల బంగారు భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్దబడుతుందని, ప్రతి విద్యార్థి సిగ్గు బిడియం లేకుండా స్వేచ్ఛగా మాట్లాడే తత్వాన్ని చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు వినూత్న వేషధారణలో పాల్గొని తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు తమ ప్రతిభను వెలికి తీయడంలో స్వయం పరిపాలన దినోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో సహకారిగా ఉంటాయని



పేర్కొన్నారు. తల్లితండ్రులు తమ పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించడం ద్వారా, వారు చేసే చిలిపి చేష్టలు ఉపాధ్యాయులకు ఎంత కష్టంగా ఉంటాయో అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. వేషధారణలో ప్రిన్సిపాల్గా చరణ్, డీఈవోగా ఎం. అభిరామ్, ఎం.ఇ.ఓగా నాగేశ్వరి, కలెక్టర్గా నందిని, ఆర్.జె.డి.గా పవన్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్గా తరుణ్ , విద్యాశాఖ మంత్రి శ్రావణి ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంది. హెచ్ఎం సుఖేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఏడాది కాంగ్రెస్ పాలనపై మావోయిస్టులు సంచలన ప్రకటన

**వారధి న్యూస్ ములుగు ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో ఏడాది పాటు కాంగ్రెస్ పార్టీ పాలన కొనసాగిన అనంతరం, మావోయిస్టులు సంచలన ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటన మావోయిస్ట్ అధికార ప్రతినిధి జగన్ పేరుతో లేఖ రూపంలో వెలువడింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి గడిచిన ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మాత్రమే దూకుడుగా ముందుకు వెళ్తోందని లేఖలో పేర్కొన్నారు. పౌరుల ప్రాథమిక హక్కులను, జీవించే హక్కును కాలరాస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పాలన రాష్ట్రాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడానికి ఆర్థిక అభివృద్ధి పేరుతో సులభతర వాణిజ్య విధానాలను ప్రవేశపెడుతున్నదని మండిపడ్డారు. ఈ విధానంలో ప్రత్యేక విభాగాలు ఏర్పరిచి, విస్తృత అధికారాలతో బుల్డోజర్ల పాలనను కొనసాగిస్తున్నారని విమర్శించారు. మూసీ నదిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, చారిత్రక కట్టడాల నిర్మాణానికి దేశీ, విదేశీ కార్పొరేట్ల పెట్టుబడులను స్వాగతిస్తోంది. కానీ, మూసీ నది పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించే చర్యలను చేపట్టడంలేదని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.



## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** చదువుతో పాటు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి అన్ని విషయాలపై విజ్ఞాన సముపార్జన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా, శిశు, దివ్యాంగుల వయో వృద్ధులు శాఖ అధ్వర్యంలో గురువారం జాతీయ బాలల దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జ్యోతి ప్రజ్వలన చేసి, జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారత తొలి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవాన్ని జరుపుకోవడం విశేషమని అన్నారు. పిల్లలు పాఠశాలలో పాఠ్య పుస్తకాలతో పాటు మన చుట్టూ ప్రపంచంలో జరుగుతున్న శాస్త్ర ,సాంకేతిక,సమకాలీన అంశాలపై విజ్ఞాన సముపార్జన కు ఇతర పుస్తకాలను కూడా చదవాలని సూచించారు. పిల్లలు చదువుతో శారీరక ఆరోగ్యం కలిగి ఉండాలంటే యోగా,క్రీడలలో పాల్గొనాలని అన్నారు.నేటి బాలలు రేపటి భావి భారత పౌరులు గా ఉన్నత చదువులు చదువుకొని జీవితం లో వివిధ రంగాలలో స్థిర పడాలని అన్నారు.ఇందుకు. క్రమశిక్షణ కలిగిన జీవన శైలి అలవర్చుకోవాలని, చదువు,ఆరోగ్యం కు ప్రాధాన్యత నిస్తూ తెలుగు భాషతో పాటు,ఆంగ్లం,హిందీ భాషలు నేర్చుకోవాలని, లైఫ్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని అన్నారు.బాలల హక్కుల పట్ల అవగాహన ఉండాలని పిల్లల సంక్షేమం కు బాలల హక్కుల కమిషన్,జువైనల్ సంక్షేమ బోర్డు,మహిళా శిశు సంక్షేమ శాఖలు పని చేస్తున్నట్లు తెలిపారు . బాలలు ఎటువంటి సమస్యలు ఎదురైనా చైల్డ్ లైన్ నంబర్ 1098 కు ఫోన్ చేస్తే సమస్య పరిష్కారం చేస్తారని అన్నారు. ఈనెల 8 నుండి 14 వ తేదీ వరకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన పిల్లలకు జిల్లా కలెక్టర్ సర్టిఫికెట్ లు అంద చేశారు ఈ సందర్భంగా బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.ముఖ్యంగా రెడ్ క్రాస్ సొసైటీ అనాథ శరణాలయం సన్నిధి విద్యార్థినీ,విద్యార్థులు లయ బద్ధంగా యోగా విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి. హరి ప్రసాద్ చేసిన మ్యాజిక్ షో,బొమ్మతో మాట్లాడించడం పిల్లలు కు వినోదం సంతోషం కలిగించాయి. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ ద్వారా పిల్లలకు పుస్తకాలు,పెన్నులు,కంపాక్స్ బాక్స్ పది వస్తువులతో కూడిన 300 కిట్ లను పిల్లలకు కలెక్టర్ ద్వారా అందచేశారు. ఈ సమావేశం లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ శ్రీ నయుముద్దీన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబెర్స్ , జువెనైల్ వెల్ఫేర్ కమిటీ మెంబెర్ శ్రీమతి గ్రెస్సి ,రెడ్ క్రాస్ చైర్మన్ నటరాజ్,సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు జగపతి రావు, జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం ,బి.సి.సంక్షేమ అధికారిణి ఇందిర,డి.పి.ఆర్. ఓ శ్రీనివాస్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ ఇస్రా,సర్వ శిక్షణా అభియాన్ బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# క్యూలైన్‌లో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

- సాధారణ వ్యక్తి మాదిరిగానే తనవంతు వచ్చాకే కంటి పరీక్షలు.

**వారధి న్యూస్, మహబూబాబాద్ ప్రతినిధి :** ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నిరాడంబర జీవనం గడిపే ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఏళ్లు గడుస్తున్నా అదే ఒరవడి సాగిస్తున్నారు. సైకిల్‌పై వెళ్లడం, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం వంటివి ఆయన విషయంలో సర్వసాధారణంగా కనిపిస్తాయి. ఇదే క్రమాన భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రిలో కంటిపరీక్షల కోసం ఆయన వచ్చారు. అక్కడ అందరితోపాటే ఓపీ చీటీ తీసుకుని వైద్యుల గది ముందు క్యూలో వేచి ఉండి తన వంతు వచ్చాక పరీక్ష చేయించుకున్నారు. వార్డుమెంబర్, సర్పంచ్, ఎంపీటీసీలే హంగూఆర్భాటాలతో జీవిస్తుండగా.., 25 ఏళ్లు ఎమ్మెల్యేగా కొనసాగిన గుమ్మడి నర్సయ్య అందుకు విరుద్ధంగా నిరాడంబరంగా వ్యవహరించడాన్ని పలువురు అభినందించారు.



# నేడే కందికొండ జాతర

- కందగిరి పర్వత శిఖరంపై భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి
- ప్రతి ఏటా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి కళ్యాణ మహోత్సవం
- జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు ప్రజా ప్రతినిధులు

**వారధిన్యూస్,మహబూబాబాద్ ప్రతినిది :** కురవి మండలంలోని కందికొండ గ్రామ శివారు లోని కందగిరి శిఖరంపై భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర(కంది కొండ)జాతర నేడు జరుగనుంది,ఏటా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు,భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామివారి జాతరకు అధికారులు పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేశారు పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించి ఆలయ శిఖరంపై అఖండ దీపాన్ని వెలిగిస్తారు గుట్టపైకి వెళ్ళడానికి రెండు మార్గాలున్నాయి, ఆయా మార్గాల్లో భక్తులు కొండ పైకి ఎక్కి స్వామి వారిని దర్శించుకుంటారు, ఒకవైపు ఉన్న మార్గంలో వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది అక్కడ పూజలు చేసిన అనంతరం లక్ష్మీ నరసింహ స్వామి వారి నీ దర్శించుకుంటారు,గుట్టపై ఉన్న కోనేరులో స్నానాలు ఆచరిస్తారు,మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు

**బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకాన్**

కందికొండ శ్రీ లక్ష్మి నర్సింహాస్వామి వారి జాతర బందోబస్త్ ఏర్పాట్లను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పరిశీలించారు, అనంతరం మాట్లాడుతూ ప్రశాంత మైన వాతావరణంలో జాతర జరుపుకోవాలని భక్తులకి సూచించారు అలాగే జాతర సమయంలో దొంగలపై ఆఖ తాయిలపై నిఘా పెట్టాలని పోలీస్ అధికారులకు తెలిపారు

ఈ కార్యక్రమంలో తొర్రుర్ డిఎస్పీ కృష్ణ కిషోర్, మరిపెడ సీఐ రాజ్ కుమార్ గౌడ్,ఎస్.బి ఇన్స్పెక్టర్ చంద్ర మౌళి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శంకర్ నాయక్,సీరోల్ ఎస్. ఐ నగేష్,చిన్న గూడూరు ఎస్సై ఝాన్సీ ఆర్. ఐ భాస్కర్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# విజ్ఞాన యాత్రలో పాల్గొన్న విద్యార్థులు



**వారధి న్యూస్, ఆత్మకూరు:** ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో ఒకరోజు విజ్ఞాన యాత్ర నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమర చింత మండల పరిధిలోని చంద్రఘడ్ కోటను జూరాల ప్రాజెక్టును సందర్శించారు. ఈ కార్యక్రమంలో యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్ రెడ్డి అధ్యాపకులు షకీల్, లతా, రవికుమార్, అంజన్న, బాలరాజు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రూప్ -3 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలి

- టీజీపీఎస్సీ ప్రతిపాదించిన ప్రతి సూచన తూ.చ. తప్పకుండా పాటించాలి
- 33 పరీక్షా కేంద్రాల్లో 9,478, మందికి గ్రూప్ 3 పరీక్ష నిర్వహణ
- అభ్యర్థులు ఉదయం 8:30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- అభ్యర్థులు ఒరిజినల్ ఐడీలతో పరీక్ష కేంద్రం కు రావాలి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో :** సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం, రీజినల్ కోఆర్డినేటర్ మధుసూదన్ శర్మ, అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, స్పెషల్ అబ్జర్వర్ నాగార్జున రెడ్డి లతో కలిసి జిల్లాలో నవంబర్ 17,18,న నిర్వహించు గ్రూప్ -3 పరీక్ష సన్నద్ధతపై డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్,చీఫ్ సూపరిండెంట్స్, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సంబంధిత అధికారులతో గురువారం సమీక్షించారు. జిల్లాలో పరీక్షకు హాజరయ్యే ప్రతి అభ్యర్థి ప్రశాంతంగా నిబంధనల ప్రకారం పరీక్ష రాసేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్, మాట్లాడుతూ.. నవంబర్ 17,18,న టి. జీ.పి.ఎస్.సి. ద్వారా నిర్వహించే గ్రూప్-3 పరీక్షకు జిల్లాలో టి.జి.పి.ఎస్.సి నియమ, నిబంధనల మేరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి అభ్యర్థులు సజావుగా పరీక్షలు వ్రాసే విధంగా చూడాలని, ఇందుకు గాను అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో మొత్తం 9,478 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, ఇందుకు గాను 33 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తేది 17.11.2024 న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం12.30గంటల వరకు పేపర్1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ( పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారు), సాయంత్రం 3.00 గంటల నుండి 5.30 గంటల వరకు పేపర్ -2 హిస్టరీ, పాలిటి అండ్ సొసైటీ ( పరీక్ష కేంద్రం గేట్లు మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారు) తేది 18.11.2024 న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం12.30గంటల వరకు పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్మెంట్ పరీక్ష( పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారు) అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతించడం జరుగుతుందని, పరీక్షా కేంద్రం గేటు మూసినా తర్వాత ఎవరిని లోపలికి అనుమతించబడదని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న పరీక్షా కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను పోలీసుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూం నుండి టీజీపీఎస్సీ నిబంధనలు పాటిస్తూ తరలించాలని అధికారులను ఆదేశించారు. టి.జి పి.ఎస్.సి. గైడ్ లైన్స్ ను ప్రతి ఒక్కరూ చదివి, నిబంధనలు పాటించాలని, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్ లు పరీక్షా కేంద్రాలను ముందస్తుగా సందర్శించి త్రాగునీటి, విద్యుత్, సీటింగ్, సి.సి. కెమెరాల ఏర్పాటును, ఇతర మౌళిక వసతులను సరి చూసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పరీక్ష రోజు పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్ లను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో ఒక ఆశ, ఒక ఏ.ఎన్.ఎం. లను ఉంచాలని, పోలీస్ బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులు వెళ్ళే ముందు క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. గ్రూప్ 3 పరీక్ష నిర్వహణ అత్యంత పటిష్టంగా జరగాలని, చిన్న తప్పుకు కూడా ఆస్కారం ఉండవద్దని జిల్లా కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులను చెక్ చేసేందుకు పురుషులకు, మహిళలకు ప్రత్యేకంగా సిబ్బంది ఉండాలని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ తో పాటు తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు



కార్డు ఒరిజినల్ తీసుకొని రావాలని తెలియజేశారు. పరీక్ష ప్రారంభానికి ముందే ఇన్విజిలేటర్లు ప్రతి అభ్యర్థి తమకు కేటాయించిన సీటులో కూర్చున్నారో లేదో చెక్ చేసుకోవాలని, ప్రతి అభ్యర్థికి నిర్దేశించిన జవాబు పత్రం, ప్రశ్నాపత్రం అందజేయాలని కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ అధికారులు, రూట్ అధికారులకు పరీక్ష రోజు చేయవలసిన విధి, విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. పరీక్షా కేంద్రాల్లో సీటింగ్ , రూమ్ వారీగా అభ్యర్థుల కేటాయింపు, చీఫ్ సూపరింటెండెంట్ రూమ్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు తదితర అంశాలు పకడ్బందీగా జరగాలని తెలిపారు.

# గంజాయి ఇతర డ్రగ్స్ ను రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవు

- జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కెకన్

**వారధిన్యూస్,మహబూబాబాద్ ప్రతినిది :** మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేయబడిన ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల తొంబై మూడు వేల రూపాయలు (1,28,93000/-) విలువైన గంజాయిని పోలీసులు దగ్ధం చేశారు. కాకతీయ మెడిక్లీన్ ఏజెన్సీ, ఊర్సుగుట్ట, హన్మకొండలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డ్రగ్ డిస్పోసల్ కమిటీ అధికారి ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోసల్ కమిటీ సభ్యులు అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నైయ్య, డిఎస్పీ తిరుపతి రావు సమక్షంలో 515 కేజీ 720 గ్రాముల గంజాయి దహనం చేశారు. మహబూబాబాద్ జిల్లా పోలీసులు జిల్లావ్యాప్తంగా గత కొంతకాలంగా నిర్వహించిన వివిధ దాడుల్లో పట్టుబడిన భారీ మొత్తంలో



నేడు ధ్వంసం చేశారు. కాలిపోయిన గంజాయి విలువ 1,28,93000/- ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లో నమోదు అయినా 24 కేసులలో మె-ుత్తం 515 730 గ్రామ్స్ గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి, ఇతర డ్రగ్సను రవాణా చేసిన వారిపై కఠిన చర్యల తీసుకుంటామని తెలిపారు. గంజాయి దగ్ధం చేయు కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డిఎస్పీ తిరుపతి రావు, సీఐ డి సి ఆర్ బి సత్యనారాయణ, సీఐ టౌన్ దేవేందర్, సీఐ డోర్నకల్ రాజేష్, సీఐ గూడూరు బాబు రావు, సీఐ బయ్యారం రవి పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు బిల్లులు త్వరగా చెల్లించాలి

- జిల్లా కలెక్టర్ ఆదేశం

**వనపర్తి , వారధి న్యూస్ ప్రతినిధి:** అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ రాజ్ శాఖ, ఈడబ్ల్యూఐడీసీ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు మంజూరు అయిన మరుగుదొడ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని, ఈడబ్ల్యూఐడీసీ శాఖకు కేటాయించిన 19 అంగన్వాడీ మరుగుదొడ్ల పనులు ఇప్పటికీ ప్రారంభం కానందుకు కారణం ఏమిటని ప్రశ్నించారు. సెప్టెంబర్ నెలలో వచ్చిన వరదల కారణంగా దెబ్బ తిన్న రహదారులకు పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖల ఆధ్వర్యంలో మరమ్మతులు త్వరగా పూర్తి చేసి, యూసీ సమర్పించాలని కలెక్టర్ సూచించారు. రోడ్ల మరమ్మత్తుల విషయంలో నిర్లక్ష్యం సహించరాదని హెచ్చరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా పాఠశాలల్లో పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు త్వరగా చెల్లించేలా తగు చర్యలు



తీసుకోవాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీర్ మల్లయ్య, ఈడబ్ల్యూఐడీసీ డిఈ, ప్రణాళికా అధికారి భూపాల్ రెడ్డి, డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- చిన్న గూడూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సిబ్బంది, నల్ల బ్యాడ్జి, లతో నిరసన

**వారధిన్యూస్,మహబూబాబాద్ ప్రతినిధి:** గత రెండు రోజుల క్రితం వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పై జరిగిన సంఘటన కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో చిన్న గూడూరు మండల ఎంపీడీవో కార్యాలయ ఎదుట కార్యాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలు తో నిరసన



తెలిపారు అనంతరం.ఎంపీడీవో రామరావు మాట్లాడుతూ చాల సౌమ్యుడు,మంచి పరిపాలన దక్షుడు కలెక్టర్ పై దాడి చేసిన సంబంధింత వ్యక్తుల పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగుల పై దౌర్జన్యం చేసినా వ్యక్తులు తప్పక మూల్యం చెల్లించక తప్పదనీ హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సోమన్న,ఆజీం, దాసు, శ్రీకాంత్, సాగర్, ఏపివో మాధవి,ఏపిఎం పాపయ్య, కార్యాలయ సిబ్బంది లలిత వెంకన్న,ఆదిబాబు పాల్గొన్నారు.



# ఏడుపాయల దుర్గమ్మను దర్శించుకున్న నాగసాధువు అఘోరి

- హిందూ దేవాలయాలపైన జరిగే దాడులను అరికట్టడమే ధ్యేయంగా దేవాలయాల పర్యాటన
- దుశ్చర్యలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని కోరారు
- గో వదను అరికట్టేందుకు హిందూలందరూ చైతన్యం కావాలి

**వారధి న్యూస్, పాపన్నపేట :** తెలంగాణలో గతకొన్ని రోజులుగా ఓ అఘోరి నాగసాధు సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని పలు ఆలయాలను సందర్శిస్తూ%౯% ఆమె పూజలు చేస్తున్నారు. తనను తాను నాగసాధు అఘోరిగా చెప్పకుంటూ సోషల్ మీడియాలో వైరల్‌గా మారారు. ఇందులోనే భాగంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాతను అఘోరి గురువారం దర్శించుకున్నారు. వనదుర్గమ్మకు పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు, ఆలయ సిబ్బంది ప్రసాదాన్ని అందించారు. వారిని చూసేందుకు భక్తులు, దుకాణ సముదాయాల నిర్వాహకులు ఆసక్తి చూపారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. లోకకళ్యాణార్థం దేవాలయాలను దర్శించుకుంటున్నానని పేర్కొన్నారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టడమే కాకుండా దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హిందువులందరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు. గో హత్యలను అరికట్టేందుకు ప్రతి హిందువు ముందుకు రావాలని సూచించారు. ఇటీవల సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించిన అఘోరి ఒంటికాలిపై నిల్చొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో భక్తులు ఆమెను.. ముత్యాలమ్మే పంపించిందని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. కొమురవెల్లి, కీసరతో పాటు పలు ఆలయాలు సందర్శించిన అఘోరి శివలింగానికి భస్మంతో అభిషేకాలు చేశారు.

# గురుకులంలో ఘనంగా స్వయం పాలన దినోత్సవం



**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం ఐనోలు గిరిజన బాలికల(పీవీటీజీ) గురుకులంలో చిల్డ్రన్స్ డే సందర్భంగా గురువారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా వివిధ సబ్జెక్టులను బోధిస్తూ తమ సహచర విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ పుష్పలత, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ సువర్ణ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వినయశీల, డిప్యూటీ వార్డెన్ ఉమాదేవి, బోధనా సిబ్బంది విద్యార్థులను అభినందించారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పుష్పలత విద్యార్థి టీచర్ల బోధనా నైపుణ్యాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన గురుకులంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని తెలిపారు. ప్రతి విద్యార్థి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడ్డాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈడీ ఎన్. రాజ్యలక్ష్మి, పీఈటీ సి. పద్మ తదితరులు పాల్గొన్నారు.



## అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి బయలుదేరిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా షోలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోనీ కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయడానికి రెండు రోజుల పర్యటనకు నేడు రాష్ట్ర శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తొ పాటు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ఉదయం సోలాపూర్ కి బయలుదేరారు.

ఈ సందర్భంగా షోలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు రోజులపాటు ప్రచారంలో పాల్గొంటారు. తిరిగి ఆదివారం రోజు హైదరాబాద్ కి చేరుకుంటారు.



## సమర్థ విద్యా నికేతన్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు

**వారధి న్యూస్, మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండల కేంద్రంలోనీ సమర్థ విద్యా నికేతన్ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు,ఈ సందర్భంగా పాఠశాల కారస్పాడేంట్ గాడిపెల్లి శ్రీనివాస్ ఉపాధ్యాయులతో కలిసి నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం మాట్లాడుతూ నెహ్రూ చేసిన సేవ కృషి మరువలేనిదని కొనియాడారు

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థి విద్యార్థినులు, పాల్గొన్నారు.



## పాదయాత్రకు ఆర్థిక సహకారం

- మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి

**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :**

జడ్చర్ల మున్సిపాలిటీ నుంచి గత నెల అక్టోబర్ 15 న జడ్చర్ల కు చెందిన దాదాపు 35 మంది అయ్యప్ప స్వాములు మాలధారణ ధరించి పాదయాత్రగా జడ్చర్ల నుంచి శబరిమల కు బయలు దేరారు ఇట్టి విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర మాజీ డాక్టర్ సి లక్ష్మారెడ్డి అయ్యప్ప స్వాములకు 50 వేలు రూపాయలు పాదయాత్ర ఖర్చులకై ఇచ్చినట్లు అయ్యప్ప స్వాములు వెల్లడించారు, మానవతా దృక్పథంతో మరోసారి తన దాతృత్వం చాటుకున్న మాజీ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు, డాక్టర్ లక్ష్మారెడ్డి కి ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో ఉండాలని శబరిలో అయ్యప్ప స్వామి కి ప్రార్థిస్తామని పేర్కొన్నారు.



## కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : శ్రీనివాస్ గౌడ్

**వారధి న్యూస్, పెబ్బేరు:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీలోని 12వ వార్డులో కొనసాగుతున్న కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేను ఏవిధంగా చేస్తున్నారో, ఎన్యుమరేటర్లు సర్వే ఫామ్‌లో వివరాలు ఏవిధంగా నమోదు చేస్తున్నారో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు ఇన్చార్జి బుర్రమోని రాములు యాదవ్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగులపై దాడి బాధాకరం..
# దోషులను వెంటనే శిక్షించాలి

- తెలంగాణ ఉద్యోగ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్

**వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి :** ప్రభుత్వం ద్వారా ఫార్మా కంపెనీ కోసం భూసేకరణ కొరకు వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం చాలా బాధాకరమని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యోగ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్ అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కాడా స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులపై లగిచర్ల గ్రామంలో జరిగిన దాడికి నిరసనగా గురువారం జగిత్యాల జిల్లా సముదాయము లో జే.ఏ.సీ ఆద్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జ్ లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన ఉద్యోగ జెఎసి చైర్మన్ జగదీశ్వర్ మాట్లాడుతూ దాడికి దిగడం వలన ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీస్తాయని, ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే దోషులను శిక్షించాలని కోరారు. టిఎన్జిఓ జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి, ట్రెసా అద్యక్షులు యం.డి. వకీల్, పెన్షనర్ల సంఘం హరి అశోక్ కుమార్, కలెక్టరేట్ ఏఒ హన్మంతరావు, పిఆర్ టీయూ అద్యక్షులు బోయిన పెల్లి అనందరావు, టిజిఒ సహద్యక్షులు రవిబాబులు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడి ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీసే విధంగా, ఉద్యోగుల భద్రత ను ప్రశ్నించే విధంగా ఉందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా పని చేసే ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకు పోవడమే కాకుండా, ప్రభుత్వం ద్వారా జారీ చేయబడిన ఆదేశాలను అమలు చేయడంలో ప్రత్యేక పాత్ర పోషించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.జి.ఓస్ మరియు జే.ఏ.సీ తరపున కరీంనగర్ అద్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాగి శ్రీనివాస్,వెంకటేశ్వర్ రావు, టిజిఒ జిల్లా కార్యదర్శి మామిడి రమేష్ టీఎన్జీవో నాయకులు అమరేందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, షాహిద్ బాబు, రవిచంద్ర, రవీందర్, మహమూద్, రాజశేఖర్, రాజేందర్, రాజేశం, సుగుణాకర్, మధుకర్, హరి ప్రసాద్, భువనేశ్వర్, కుమారస్వామి, సురేందర్, భాస్కర్, శ్రీనివాస్, మురళి, చంద్రిక, మమత, శైలజ, విజయలక్ష్మి, అర్చన, నాగరాజు, సురేందర్ నాయక్, పూర్ణచందర్, ఆనంద్,రవి,నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చంద్రయ్య, ముజాహిద్ ఖాన్, అరుణ, అజీం, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



## దళితులు సంఘటితమై పోరాడితేనే మనుగడ : రవీందర్

**వారధి న్యూస్, ఆత్మకూరు :** దేశంలో దళితులు మనుగడ కోసం సంఘటితమై పోరాడాలని దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్) జిల్లా అధ్యక్షుడు ఏ. రవీందర్ పిలుపునిచ్చారు. గురువారం వనపర్తి సిపిఐ ఆఫీసులో డిహెచ్పిఎస్ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పలువురికి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దేశ వ్యవసాయ రంగ ఉత్పత్తిలో దళితుల శ్రమ అధికంగా ఉందన్నారు. వ్యవసాయ ఉత్పత్తి సంపదలో వారికి రావలసిన న్యాయమైన వాటా రావటం లేదన్నారు. అందుకే దేశంలో దళితులకు ఆర్థిక, రాజకీయ, సామాజిక హక్కుల రక్షణ, సామాజిక న్యాయం కల్పించాలన్నారు. కుల వివక్ష, కుల నిర్మూలన కోసం చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ దేశమంతా అమలు చేయాలన్నారు. ఎస్సీల అభివృద్ధికి కేటాయించిన నిధులను దారి మళ్లించకుండా వారి అభివృద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అనేక సందర్భాల్లో పాలకులు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులకు అన్యాయం చేశారన్నారు. డిమాండ్ల సాధన కోసం దేశంలో రాష్ట్రంలో దళితులు సంఘటితమై పోరాడాలన్నారు. డిహెచ్పిఎస్ లో గ్రామ గ్రామాన దళితులు సభ్యత్వం తీసుకొని సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం రెండవ జాతీయ మహాసభలు జనవరి 5 6 7 తేదీల్లో హైదరాబాద్ మోక్షగుండ విశ్వేశ్వరయ్య భవన్ లో జరుగుతాయని పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. చిన్న కురుమయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు బహుకరణ

**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** అడ్డాకుల మండల పరిధిలోని కన్మనూరు గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నెహ్రూ పుట్టినరోజును పురస్కరించుకొని బాలల దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కురుమూర్తి అనుమతితో విద్యార్థులకు ఉచితంగా ఏకరూప టి షర్టు పాయింట్లను బహుకరించారు. ఈ సందర్భంగా కన్మనూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ మాట్లాడుతూ మా విద్యార్థులకు ఏదో కొంత సహాయం చేయాలని ఆశతో ఆలోచన చేసి మా కోడలు పూజ స్నేహల్ జన్మదినం సందర్భంగా



గురువారం 41 మంది పాఠశాల విద్యార్థులకు టీ షర్ట్స్, పాయింట్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలు వేసుకున్న ఏకరూప దుస్తులను చూసి సంతోషం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సుజాత, మాజీ సర్పంచ్, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా బాలల దినోత్సవం

**వారధి న్యూస్, ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణంలోని ప్రగతి హై స్కూల్ నందు గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూల దండ వేసి మిఠాయిలు పంచుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేసి అలరించారు. అందరినీ అలరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని చాచా నెహ్రూ జయంతి వేడుకలు

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** అచ్చంపేట పట్టణంలోని అక్స్ఫర్డ్ మోడల్ స్కూల్ లో గురువారం భారతదేశపు మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా హెడ్మాస్టర్ ఎన్నిగంటి శేఖర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని అన్నారు.నెహ్రూ భారతదేశ తొలి ప్రధాని అని,స్వాతంత్ర పోరాట నా య ం క ం డ ని , గొ ప్ప రచయిత,రాజకీయవేత్త అని అన్నారు.విద్యార్థులు చిన్నతనం నుంచే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని చదువుకోవాలని అన్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అండర్ 14 వాలీబాల్ క్రీడలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి అండర్ 14 విభాగంలో ఎస్.దేవేందర్ 9వ తరగతి విద్యార్థి ఎంపిక కావడం జరిగింది.పాఠశాల యాజమాన్యం ఎన్నిగంటి శేఖర్,శశిరేఖ మరియు పి ఇ టి రాజు అభినందించారు.



## వాలీబాల్ విద్యార్థులకు అభినందనలు

**వారధి న్యూస్, ఆత్మకూరు :** ఆత్మకూరు పట్టణము నందు గురువారం బాలికల ఉన్నత పాఠశాల యందు ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయిలో ధన్వాడలో జరిగిన వాలీబాల్ పోటీల్లో వనపర్తి వాలీబాల్ జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఇట్టి జట్టులో ఆత్మకూరు పట్టణానికి చెందిన నలుగురు బాలికలు ఉన్నారు. వీరిని ఆత్మకూరు మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి రవికుమార్, మండల విద్యాధికారి బాలరాజు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సంతోష, ఘనంగా శాలువతో సన్మానించారు. ఈనెల 16న మెదక్ రాష్ట్రస్థాయి వాలి బాల్ పోటీలు జరగనున్నాయి.




## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**వారధి న్యూస్, పెబ్బేర్:** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన జక్కుల తిరుపతయ్య అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్ ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు.

# పల్లె పోరుకు.. సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

### ఓవైపు బీసీ కమిషన్.. మరోవైపు కులగణ

బీసీల ఆర్థిక సామాజిక స్థితి గతులను అంచనా వేసేందుకు ప్రభుత్వం నియమించిన బీసీ కమిషన్ అన్ని జిల్లాలలో పర్యటిస్తుంది. మలి విడత ఓటరు జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని శాసనసభ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. బీసీల రిజర్వేషన్ల పైన ఆసక్తికర చర్చ నడుస్తోంది.గత ప్రభుత్వం కొత్త పంచాయతీరాజ్ యాక్ట్ మున్సిపల్ యాక్ట్ ప్రకారం రిజర్వేషన్లు మార్పు లేకుండా రెండు రెండు టర్ముల వరకు ఒకే రిజర్వేషన్ ఉండేలా చట్టం చేసింది. కానీ కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రావడంతో రిజర్వేషన్ల మార్పు పైన చర్చ మొదలైంది, బీసీల రిజర్వేషన్లు 42 శాతం పెంచుతామని హామీ ఇవ్వడంతో ఆ వర్గం లీడర్లలో ఆశలు చిగురుస్తున్నాయి.






### ఆశావాహుల్లో సందడి...

స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ పెంచడం గ్రామ పట్టణ రాజకీయాల్లో ఊహించని పరిణామాలు ఎదురవుతాయని ఆ వర్గం నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే సర్పంచులు. జడ్పిటిసి. ఎంపీపీల పదవి కాలం ముగిసిపోయింది. కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు రావడం లేదు దీనికి తోడు వచ్చే ఏడాది జనవరిలో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం కూడా ముగుస్తుంది. అన్నింటికి కలిపి ఒకే దెబ్బ ఎన్నికలు నోటిఫికేషన్ ప్రకటిస్తే బీసీలకు పోటీ చేసే అవకాశాలు మెండుగా ఉంటాయి. రిజర్వేషన్ల పెంపుతో మళ్లీ కొత్త రిజర్వేషన్లు రూపొందించాల్సి ఉంటుంది. గ్రామ స్థాయిలోనే కాక మండల మున్సి పల్ స్థాయిలో కూడా రిజర్వేషన్లు లో మార్పులు జరుగుతాయి. గత పదివేల నుంచి స్థానిక ఎన్నికల్లో ఉనికి లేకుండా పోయిన కాంగ్రెస్ పార్టీకి కొత్త రిజర్వేషన్లు కల్పిస్తాయని సంబరపడుతున్నారు.

వలస వచ్చిన లీడర్లు టిఆర్ఎస్ లీడర్లకు మధ్య పోటీ సైతం తీవ్రంగానే ఉంటుందని లోకల్ లీడర్లు చెప్తున్నారు. దీనిలో భాగంగా కేసీఆర్ మాజీ ఎమ్మెల్యేలను ప్రజల మధ్యనే ఉండాలని ఆదేశించారు. జనవరిలో సీఎం రేవంత్ వాడపల్లి నుంచి మూసి యాత్ర మొదలు పెడతానని ప్రకటించడంతో కొత్త ఏడాదిలో రాజకీయం రసవత్తరంగా ఉంటుందని స్థానిక ప్రజా ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

# నిష్కామ కర్మయోగి చంద్రమౌళి

**ఆయన తొలితరం ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ నాయకుడు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు. గాంధేయవాది. అంతే కాకుండా మహాత్మా గాంధీకి అత్యంత సన్నిహితుడు. సంయుక్త మద్రాసు రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ మూడిరటిలో మంత్రిపదవులు నిర్వహించిన గొప్పతనం ఆయనది. భారత రాజ్యాంగ పరిషత్ (మొదటి పార్లమెంట్) సభ్యునిగా ఎన్నికైన ఘనత ఆయనది. దేవాదాయ శాఖా మంత్రిగా, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షునిగా, శ్రీశైలం, భద్రాచలం దేవాలయాల జీర్ణోద్ధారకునిగా, భద్రాచల దేవస్థాన అధ్యక్షునిగా, పుణ్యక్షేత్ర పునఃనిర్మించిన కీర్తి ఆయనకే దక్కింది. సమగ్ర పంచాయితీ రాజ్ చట్టం మొదటిసారి రూపొందించి మద్రాసు శాసన సభలో అమోదింప జేసిన వ్యక్తిగా చిరకాలం గుర్తుండే పనితనం ఆయనది. ఆయనే మహాత్మాగాంధీకి అత్యంత సన్నిహితులలో ఒకరైన కల్లూరి చంద్రమౌళి.**

మహాత్మాగాంధీ చూపిన బాటలో నడిచి ఆనాటి మేటి ఉద్యమాలైన సైమన్ గో బ్యాక్, ఉప్పు సత్యాగ్రహం. విదేశీ వస్త్ర బహిష్కరణ, శాసనోల్లంఘన, హరిజనోద్ధరణ, సహాయ నిరాకరణ ఉద్యమాలలో చురుకుగా పాల్గొని ప్రజలకు నాయకత్వం వహించి పలుమార్లు జైలు జీవితం అనుభవించాడు. కల్లూరి చంద్రమౌళి (నవంబరు 15, 1898 - జనవరి 2, 1992) 1898 నవంబరు 15న గుంటూరు జిల్లా, అమృతలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో వెంకమాంబ, సుదర్శనంలకు జన్మించాడు. బాల్యం నుండి భారతీయ సంస్కృతి సంప్రదాయాలంటే ఇష్టం కాగా, ప్రాథమిక విద్య తుళ్ళూరు, తెనాలి, బాపట్ల లో ఉన్నత విద్య కలకత్తా లోనూ చదివాడు. 1920లో ఇంగ్లాండు వెళ్ళి స్కాట్లాండు లోని ఎబర్డీన్ విశ్వవిద్యాలయం నుండి వ్యవసాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1926లో వార్ధా సేవాగ్రాం వెళ్ళి తొలిసారి గాంధీజీని కలిసాడు. అక్కడ మూడు నెలలు ఉండి కాంగ్రెస్ కార్యకర్తగా ఖద్దరు దరించి, గుంటూరు వచ్చాడు. ఊరురూ తిరిగి యువజన సంఘాలను పెట్టి వారిలో స్వతంత్ర భావాలను నాటాడు.1929 లో గాంధీజీ గుంటూరు జిల్లా పర్యటనలో తోడుగా ఉండి స్వాతంత్ర్య సమరానికి విరాళాలు పోగుచేసాడు. మహాత్మా గాంధీ నాయకత్వంలో అన్ని జాతీయోద్యమాలల్లో పాల్గొని అనేకసార్లు జైలు కెళ్ళాడు. ఉప్పు సత్యాగ్రహం లో పాల్గోని అరెస్టైయి 18-6-1930 నుండి 12-3 1931 వరకు రాయవెల్లూరు జైల్లో గడిపాడు. గుంటూరులో కొండా వెంకటప్పయ్య ఇంటిలో ఉప్పు తయారు చేసి శాసనోల్లఘన చేసినందులకు 25-2-1932 నుండి 24-2-1933 వరకు కడలూరు జైల్లో గడిపాడు.1933 డిసెంబరులో గాంధీజీ ఆంధ్రలో హరిజన యాత్ర సాగించాడు. గుంటూరు పర్యటనలో చంద్రమౌళి అన్ని తాన్కె దానిని విజయవంతం చేసాడు. గాంధీజీ చేత 1933 డిసెంబరు 23 న కావూరు విమానాశ్రయానికి ప్రారంబోత్సవం జరిపించాడు. అనేక గ్రామాలలో హరిజనులచేత దేవాలయ ప్రవేశం చేయించాడు.1934 లో గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీకి, 1938లో జిల్లా బోర్డ్ అధ్యక్షుడ్కెనాడు. 1937, 1946, లలో శాసనసభకు ఎన్నికై మద్రాసు ప్రావిన్సులో శాసన సభ్యునిగా పనిచేసాడు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఓ,పి



రామస్వామి రెడ్డియార్ మంత్రివర్గంలో చంద్రమౌళి స్దానిక సంస్థలు, సహకార శాఖామాత్యులుగా (1947 - 1949) పనిచేసాడు.1946 లో ఏర్పడిన భారత రాజ్యాంగ పరిషత్ (మొదటి పార్లమెంట్) సభ్యునిగా మద్రాస్ ప్రావెంషియల్ నుండి ఎన్నికై భారత రాజ్యంగ సభ్యులుగా రెండు ఏళ్ళు పనిచేసాడు. 1933లో ఆయన రాసిన నానా దేశ రాజ్యాంగాలు, రైతు రాజ్యాంగం పుస్తకాలు, వివిధ దేశాల రాజ్యాంగాలపై ఉన్న పట్టుకి నిదర్శనాలుగా నిలిచినందునే ఆయనను భారత రాజ్యాంగ పరిషత్తుకి సభ్యునిగా ఎన్నుకొన్నారు.1949- 52 లలో పి.యస్. కుమారస్వామి రాజా మంత్రివర్గంలో స్థానిక స్వపరిపాలన, సహకార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. 1955 లో జరిగిన తొలి శాసన సభ ఏన్నికలో చంద్రమౌళి అమృతలూరు నుండి ఏన్నికై బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలో రెవెన్యూ, దేవాదాయ శాఖా మంత్రిగా (1955-56) పనిచేసాడు. దామోదరం సంజీవయ్య గారి మంత్రి వర్గంలో దేవాదాయ శాఖా మంత్రిగా (1960- 62) పనిచేసాడు.1964లో తిరుమల తిరుపతి దేవస్థానం అధ్యక్షునిగా, రామాలయ జీర్ణోద్ధరణ సంఘం అధ్యక్షునిగా పనిచేశాడు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యునిగా పనిచేసాడు. చంద్రమౌళి అధ్యక్షులుగా భద్రాచల రామాలయ జీర్ణోద్ధరణ సంఘం ఆలయాన్ని ఆగమ విరుద్ధంగా నిర్మిస్తున్నారని దానిని నిలువరించాలని కాంగ్రెస్ లోని వీరి ప్రత్యర్థులు ఆందోళన చేసి, అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డిచే విచారణ కమిటీని ఏర్పాటు చేయించారు. తనను కనీసం సంప్రదించకుండా సంజీవ రెడ్డి కమిటీ నియమించినందులకు నిరసించాడు. ఆత్మాభిమానంతో రామాలయ జీర్ణోద్ధరణ సంఘానికి, తర్వాత స్వార్థ రాజకీయాలకు నిరసనగా 1965 లో తన శాసన సభ సభ్యత్వానికి, టి.టి.డి అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేసాడు. నమ్మిన సిద్దాంతం కొరకు పదవిని తృణప్రాయంగా విసర్జించిన పరిశుద్ధ గాంధేయ వాది చంద్రమౌళి.భద్రాచలం గుడి 1960 నాటికి గుడి బాగా శిథిలమైంది. చంద్రమౌళి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా నియమితుల్కెన, వెంటనే గుడి పునఃనిర్మాణానికి నడుం కట్టారు. తమ అధ్యక్షతన రామాలయ జీర్ణోద్ధరణ సంఘం ద్వారా చంద్రమౌళి రాష్ట్రం నలుమూలల తిరిగి లక్షలాది రూపాయల విరాళాలు పోగుచేశాడు. తమిళనాడులోని రామనాథపురం జిల్లాకు చెందిన శిల్పాచార్యులు గణపతి స్థపతిని ఆహ్వానించి, ముందుగా కల్యాణమండపం కోసం సరైన రాయిని తమిళనాడులోని దిండివనంలో గుర్తించి, కొత్తగూడెం వరకు రైళ్ళలో తెచ్చి అక్కడినుండి గోదావరి వరకు లారీలలో తరలించారు. పెద్ద పెద్ద రాతి శిలలను ఇసుకలో నెట్టుకు వచ్చి, లాంచీలలో కెక్కించి అతికష్టంతో భద్రాచలం చేర్పించారు. 500 శిల్పులు 3 లక్షల ఖర్చుతో సకల కళాశోభితమైన కళ్యాణ మండపం, రామాలయానికి దక్షిణాన ఉన్న రంగనాయకుల గుట్టపై రామదాసు ధ్యానమందిరం, శిల్ప శోభాయమానమైన గోపురాలు నిర్మించారు. దీనిలో ఆరు అడుగుల పచ్చరాయి రామదాసు విగ్రహం ప్రతిష్ఠించారు. సమీపంలోని తాటియాకుల గూడెంలో సేకరించిన పూర్తిగా నల్లరాతితో ప్రధాన ఆలయాన్ని సౌందర్య శిల్పాలతో నిర్మించారు మహామండపాన్ని అష్టలక్ష్ములు, దశావతారాలు, ఆళ్వారుల శిల్పాలతో అలంకరించారు. 32 టన్నుల ఏకశిలతో మూడు అంతస్తులు కలిగి అన్ని దేవతామూర్తుల శిల్పాలతో శోభాయమానమైన ఆలయ విమానం ఏర్పాటు చేశారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా పదవి చేపట్టగానే 1974 లో తిరిగి రామాలయ ధర్మకర్తల సంఘానికి అధ్యక్షులుగా నియమించాడు. వెంటనే విశేషంగా విరాళాలు సేకరించి చిత్రకూట మంటపాన్ని 127 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో నిర్మించాడు. స్తంభాలపై అద్భుతమైన శిల్పాలు చెక్కించాడు.నిడారంబత, నిష్కలంక నిస్వార్ధ నిర్మల జీవనం గడిపిన ఆర్ష విద్యాలంకార బిరుదాంకితు డయిన కల్లూరి చంద్రమౌళి 94 ఏళ్ళ వయస్సులో మోపర్రులో 1992 జనవరి 2న ఒక కర్మయోగిగా ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

# సంఘ సంస్కర్త ఆచార్య వినోబా భావే



వినోబా భావే (1895-1982) భారత దేశంలో ఆధ్యాత్మికత, సామాజిక, గ్రామీణ పునరుద్ధరణకు అపార కృషి చేసిన మహనీయుడు. ఆయన గాంధీయేతర కాలంలో కూడా గాంధీజీ ఆశయాలను జీవితమంతా పాటిస్తూ, సమాజ సుభిక్షత కోసం తన జీవితాన్ని అంకితమిచ్చారు. వినోబా భావే మహాత్మా గాంధీ శిష్యుడిగా, సార్వజన సౌభ్రాతృత్వం, శాంతి, సామాజిక సమానత్వం కోసం తన జీవితంలో ఎన్నో కార్యక్రమాలు చేశారు. వినోబా భావే 1895 సెప్టెంబర్ 11న మహారాష్ట్ర లోని గగోడా గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ఆయనలో ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఆయన తల్లి రుక్మిణీదేవి తనకు ఆధ్యాత్మికత మరియు మతంపై ప్రేమను పెంచగా, తండ్రి నారహరి శాస్త్రి గణితం, శాస్త్రాల పట్ల ప్రేరణను అందించారు. ఆయన ముంబైలో విద్య నభ్యసించి నప్పటికీ, గ్రంథాలపై, భక్తి మార్గంపై ఉన్న ఆసక్తి కారణంగా ఆయా రంగాల్లో అభ్యాసం కొనసాగించారు.1916లో వినోబా మహాత్మా గాంధీని కలుసుకున్నారు. గాంధీజీ ఆత్మనిబద్ధత, సత్యం, అహింసా వంటి సిద్ధాంతాల పట్ల వినోబాను ప్రేరేపించారు. ఈ కలయికతో వినోబా తన జీవితాన్ని సార్వజన సేవకు అంకితం చేస్తూ గాంధీజీ ఆశయాలను స్వీకరించి నడిచారు. గాంధీజీ వినాయక నరహరి భావేను "వినోబా" అని నామకరణం చేశారు. గాంధీజీ మరణం తర్వాత వినోబా భావే భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఆత్మ నిర్భర గ్రామాల రూప కల్పనలో మరింత చురుకుగా పాల్గొన్నారు. 1951లో వినోబా భావే ఆంధ్రప్రదేశ్ లోని పోచంపల్లి గ్రామంలో భూదాన్ ఉద్యమాన్ని ప్రారంభించారు. భూస్వాముల వద్ద ఉన్న భూమిలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయాలని ప్రజలను కోరుతూ వినోబా భారత దేశమంతా యాత్ర చేశారు. ఇది సామాజిక న్యాయానికి, భూముల పునరాగమనం కోసం వినూత్న మార్గం అయింది. ఈ ఉద్యమం వల్ల దేశ వ్యాప్తంగా దాదాపు 40 లక్షల ఎకరాల భూమి పేదులకు లభించింది. భూదాన్ ఉద్యమం వినోబా భావేకు భారతీయ సమాజంలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగించింది, కేవలం సామాజిక సమానత్వం మాత్రమే కాదు, సామాజిక బాధ్యత మరియు దాన ధర్మాన్ని ప్రోత్సహించే ఉద్యమంగా గుర్తింపు పొందింది.వినోబా భావే సర్వోదయ ఉద్యమం ద్వారా సర్వజన సమానత్వాన్ని ప్రోత్సహించారు. "సర్వోదయం" అనగా సర్వ ప్రజల ఉజ్వలత అని అర్థం. ఈ ఉద్యమం ద్వారా ఆయన సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఆయన లక్ష్యం సర్వ సమాజం ఒకటిగా ముందుకు సాగాలని, సమాజంలోని ప్రతిఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని స్పష్టం చేశారు.వినోబా భావే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సామాజిక సుభిక్షత సాధించాలనే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను ప్రారంభించారు. అతని గ్రామస్వరాజ్య కల నేడు స్ఫూర్తిగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, మరియు స్వయం-పోషణకు ప్రాముఖ్యత నిస్తూ ఆయన అనేక కార్యక్రమాలను నిర్వహించారు. వినోబా భావే అనేక గ్రంథాలను రచించారు, ఇందులో ప్రముఖమైనది "గీతా ప్రవచన్", ఇది భగవద్గీత పై ఉన్న ఆయన ప్రత్యేకమైన దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది. భగవద్గీత పై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది, మరియు ఆయన దానిని ఆచరణలోకి తీసుకురావడం, జీవితంలో సత్యం, ధర్మం, అహింస వంటి విలువలను పాటించడం ఎంతో ముఖ్యమని నమ్మారు. ఈ రచనలలో వ్యక్తిత్వ పరిపూర్ణత, సామాజిక సవరణ వంటి అంశాలు ప్రతిఫలిస్తాయి. వినోబా భావే చివరి రోజులను మధ్య భారత దేశంలోని పావ్నార్ లోని తన ఆశ్రమంలో గడిపారు 15 నవంబర్ 1982న అక్కడే తుది శ్వాస విడిచారు. ఆయన మరణించినప్పటికీ ఆయన చూపించిన మార్గం భారతదేశానికి ఒక దీపంగా నిలిచింది. ఆయన ఆదర్శాలు, ముఖ్యంగా భూదాన్ ఉద్యమం, సర్వోదయ ఉద్యమం, గ్రామస్వరాజ్యం- ఇవన్నీ భారతీయ సమాజంలో సతత మార్పులకు దారి చూపిస్తున్నాయి. వినోబా భావే చూపించిన మార్గంలో నడుస్తూ, సమాజసేవ, సామాజిక సవరణ కోసం యత్నించే వారందరికీ ఆయన ఒక స్ఫూర్తి.

# గోరా జీవిత సర్వస్వం హేతువాదానికే అంకితం



హేతువాదం అనే తాత్విక విధానాన్ని విశ్వసించి అనుసరించే వారిని హేతువాదులు అంటారు. హేతువు అంటే కారణం అని అర్థం. ఏద్కెనా ఒక విషయాన్ని గుడ్డిగా విశ్వసించకుండా దానికి కారణాలను అన్వేషించడం లేదా ఆరా తీయడాన్ని హేతువాదం అంటారు. జ్ఞానానికి లేదా ఋజువుకు "హేతువు" లేదా "కారణం" అనేది మాత్రమే నమ్మదగిన ఆధారం అని భావించే తాత్విక ధోరణిని హేతువాదం అంటారు. హేతువాదానికి శాస్త్రీయ దృక్పథం పునాది. మానవుడే కొలమానం, మనిషి అన్నిటికీ మూలం అనే మూల సూత్రాలతో హేతువాదం ఆవిర్భవించింది. గోరా'గా ప్రసిద్ధుల్కెన గోపరాజు రామచంద్ర రావు నాస్తికుడిగా, హేతువాదిగా, గాంధేయవాదిగా తెలుగు వారందరికీ సుపరిచితులు. ఆయన దృష్టిలో ఆస్తికత, హేతు వాదం రెండు భిన్న ధ్రువాలు. నేటి సమాజంలో అగ్ర, నిమ్న జాతులనే వర్ణ బేధాలు, అంధ విశ్వాసాలు పెరగటానికి ఆస్తికతే కారణం అని ఆయన గట్టి నమ్మకం. మానవులందరూ ఒకటే అన్న భావం పెరగాలంటే , అది ఒక్క నాస్తికవాదం వల్లనే సాధ్యమని విశ్వసించి, నాస్తికభావాల ప్రచారం కోసం తన జీవితమంతా వెచ్చించారు గోరా. పెళ్ళికి ముందే సెక్స్ పై అవగాహనలు, కుటుంబ నియంత్రణ, వీటితో పాటు అప్పటి తెలుగు సమాజంలో ఎన్నో విప్లవా త్మక మార్పులను తెచ్చిపెట్టిన ఘనత గోరాదే. గోరా ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న ఛత్రపూర్ అనే కుగ్రామంలో, 1902, నవంబరు 15 న ఉన్నత కుల హిందూ కుటుంబంలో వెంకట సుబ్బారావు, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించారు. పర్లాకిమిడిలో ప్రాథమిక విద్యాభాసం పూర్తిచేసిన తర్వాత 1913లో పిఠాపురం రాజా కళాశాల ఉన్నత పాఠశాలలో చదివారు. 1920లో పిఠాపురం రాజా అనుబంధ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన గోరా, అప్పుడే ప్రారంభమౌతున్న సహాయ నిరాకరణోద్యమంలో కాలూనారు. 1922లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో వృక్షశాస్త్రంలో బి.ఏ చేశారు. రామచంద్రరావు వృక్ష శాస్త్రంలో డిగ్రీ చదివి, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అదే శాస్త్రంలో మాస్టర్ డిగ్రీలో ఉత్తీర్ణుడయ్యారు. 1922 లో సరస్వతిని ఆమె 10 ఏళ్ళ ప్రాయంలోనే వివాహం చేసుకున్నారు. మధురలోని మిషన్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరాడు. కోయంబత్తూరు వ్యవసాయ కళాశాలలో ప్రత్తి పరిశోధనా సహాయకుడిగా, తర్వాత కొలంబోలోని ఒక కళాశాలలో జీవశాస్త్ర అధ్యాపకునిగా, 1928లో కాకినాడ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. తాను నడిచే మార్గం తండ్రికి ఇష్టం లేకపోవడంతో 1928 లో భార్య, పిల్లలతో ఇంటిని వదిలేసి వచ్చారు. స్వతంత్ర భావాలుగల గోరా ఎక్కడా ఉద్యోగంలో నిలువలేక పోయారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి ఉద్యమాలలో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వపు జైళ్లలో కఠిన శిక్షలు అనుభవించారు. గోరా అనేక రచనలను చేశారు. సంఘం, ఆర్థిక సమత అనే పత్రికలను నడిపారు. వర్ణవ్యవస్థ, అంటరానితనం మీద తన యుద్ధాన్ని ప్రకటించిన గోరా 1940 లోఆయన భార్యతో కలసి నాస్తిక కేంద్రాన్ని, కృష్ణా జిల్లాలోని ఒక గ్రామంలో ప్రారంభించారు. దేశ స్వాతంత్ర్యం సందర్భంగా, 1947 లో, కేంద్రాన్ని విజయవాడకు తరలించారు. 1944లో మహాత్మా గాంధీ కోరిక మేరకు అఖిల భారత కాంగ్రెస్ ఆర్గన్కెజర్గా అలహాబాద్, ఢిల్లీలలో పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధుని గానేకాక, సాంఘిక, ఆర్థిక సమానత్వ సాధనకు, మూఢ నమ్మకాల నిర్మూలనకు, ప్రజల్లో శాస్త్రీయ దృష్టిని పెంపొందించ డానికి, వయోజన విద్యా వ్యాప్తికి, కుల, మత తత్వాల నిర్మూలనకు అనితర కృషి గోరా సల్పారు. గాంధీతో నాస్తికత్వంపై చర్చలు జరిపి, అస్పృశ్యతా నిర్మూలన కోసం కృషి చేసారు. దళితుల దేవాలయ ప్రవేశాన్ని, సమష్టి భోజనాలను, వివాహాలను విస్తృతంగా ఆయన నిర్వహించారు. ఉప్పు సత్యాగ్రహం కాలంలో పుట్టినందున లవణం, భారతీయులు చట్టసభలలో నిలిచి గెలిచిన కాలంలో పుట్టినందున విజయం, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పుట్టినందున ఒక కుమారునికి సమరం, మరొక కుమారునికి నియంత. తొమ్మిదవ సంతానానికి నౌవ్ గా పేర్లు పెట్టారు.



# చలికాలంలో ఈ పండ్లు తింటే..
# సీజనల్ సమస్యలన్నీ పరార్!

ఆరోగ్యానికి పండ్లు చాలా మేలు చేస్తాయి. ముఖ్యంగా సీజనల్‌గా దొరికే పండ్లు ఆరోగ్యానికి ప్రయోజనాలను చేకూరుస్తాయి. అయితే సీజనల్‌గా దొరికే పండ్లలో జామ, ఆపిల్, ఆరెంజ్ ఇలా రకరకాల పండ్లు ఉన్నాయి. చలికాలం ప్రారంభమైతే చాలా మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతుంటారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తగ్గిపోయి జలుబు, దగ్గు వంటి సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. ఈ సీజన్‌లో ఎలాంటి సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే తప్పకుండా ఆహార విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఈ సీజన్‌లో కొన్ని రకాల పండ్లను డైట్‌లో చేర్చుకోవాలి. చలికాలంలో తప్పకుండా డైలీ పండ్లు తినడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఆరోగ్యంగా ఉంటారు. ఆరోగ్యానికి మేలు చేసే కొన్ని రకాల పండ్లను తినకపోవడం వల్ల చాలా మంది ఈ రోజుల్లో దగ్గు, జలుబు వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా అయిన కూడా పండ్లు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటిని డైలీ తినడం వల్ల ఎన్నో దీర్ఘకాలిక వ్యాధుల నుంచి విముక్తి చెందవచ్చు. వింటర్‌లో చలి తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో చాలా మంది సీజనల్ వ్యాధుల బారిన పడతారు. వీటి బారిన పడకుండా ఉండాలంటే కొన్ని రకాల పండ్లను తప్పకుండా తినాలి.

**ఖర్జూరాలు:** డ్రైఫ్రూట్స్‌లో ఖర్జూరాలు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. వీటిని డైలీ తినడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలు అందుతాయి. ఇందులోని కాల్షియం ఎముకల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. అలాగే రోగనిరోధక శక్తిని కూడా మెరుగుపరుస్తుంది. వీటిని ఉదయం పూట తినడం వల్ల రోజంతా అలసట, నీరసం లేకుండా యాక్టివ్‌గా ఉంటారు. చలికాలంలో ఎలాంటి సీజనల్ సమస్యలు రాకుండా ఉండటానికి ఇవి బాగా ఉపయోగపడతాయి. డైలీ కనీసం నాలుగు నుంచి ఐదు తిన్నా చాలు. ఎలాంటి సమస్యలు ఉండవు.

**కివి:** రేటు అధికంగా ఉండే కివి పండ్లలో కాల్షియం, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే ఎముకల ఆరోగ్యానికి కూడా బలాన్ని చేకూరుస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణ సమస్యలు రాకుండా కాపాడుతుంది. కివి పండ్లలో ఎక్కువగా విటమిన్ ఇ ఉంటుంది. ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా బాగా ఉపయోగపడుతుంది.

**జామ పండ్లు:** జామపండులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులోని విటమిన్ సి చర్మ ఆరోగ్యాన్ని మెరుగుప రచడంతో పాటు ఎలాంటి అనారోగ్య సమస్యల బారిన పడకుండా చేస్తుంది. ముఖ్యంగా జలుబు, దగ్గు రాకుండా కాపాడుతుంది. డైలీ జామ పండ్లు తినడం వల్ల ఇమ్యూనిటీ పవర్ కూడా పెరుగుతుంది. దీనివల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు కూడా దరిచేరవు. డైటరీ ఫైబర్ జామ పండ్లలో అధికంగా ఉంటుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుంది. అలాగే శరీరానికి కావాల్సిన విటమిన్ డి, కాల్షియం కూడా అందుతాయి.

**నారింజ పండ్లు:** విటమిన్ సి ఎక్కువగా ఉండే నారింజ పండ్లను తినడం వల్ల రోగనిరోధక శక్తి తొందరగా పెరుగుతుంది. అలాగే ఈ పండ్లు చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యంగా ఉండేలా సాయపడతాయి.

# మసాజ్‌తో ఇన్ని ప్రయోజనాలా!

ఏద్కైనా పని ఎక్కువగా చేస్తే బాడీ అంతా నొప్పులు అయిపోతుంది. బాడీలో ఉన్న పెయిన్స్ అన్ని తగ్గాలని కొందరు వేడి నీటితో స్నానం చేయడం లేదా బాడీని మసాజ్ చేస్తుంటారు. మసాజ్ చేయడం వల్ల బాడీకి చాలా ప్రయోజనాలు ఉన్నాయి. నిజం చెప్పాలంటే కొన్ని అనారోగ్య సమస్యల నుంచి ఈజీగా విముక్తి చెందవచ్చు. పూర్వ కాలంలో కొన్ని రకాల వ్యాధులను తగ్గించుకోవడానికి ఎక్కువగా మసాజ్ చేసేవారు. ఈ రోజుల్లో అందరూ ఇంగ్లీషు మందులు వాడుతున్నారు. కానీ పూర్వకాలంలో అయితే వీటితో పెద్దగా పని ఉండేది కాదు. సమస్య తీవ్రం అయితేనే వాడేవారు. ఎక్కువగా ఇలాంటి మసాజ్ చికిత్స పద్ధతులు ఆయుర్వేదంలోనే ఉపయోగించేవారు. బాడీలో ఎలాంటి సమస్య వచ్చిన కూడా మసాజ్ చేయడం వల్ల తొందరగా ఆ సమస్య తగ్గిపోతుంది. మసాజ్ చేయడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. తలపై మసాజ్ చేయడం వల్ల జుట్టు బలంగా పెరుగుతుంది. బాడీని మసాజ్ చేయడం వల్ల కండరాల నొప్పులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్‌తో బాధపడేవారు బాడీని మసాజ్ చేస్తే తొందరగా ఈ సమస్య నుంచి విముక్తి చెందుతారు. రోజూ బాడీని మసాజ్ చేయడం వల్ల రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దీనివల్ల శరీరానికి కావాల్సిన బ్లడ్ అన్ని భాగాలకు ఈజీగా సరఫరా అవుతుంది. దీనివల్ల సగం సమస్యలు తగ్గుతాయి. రోజూ బాడీకి మసాజ్ చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీనివల్ల దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలు తొందరగా రావు. వీటి నుంచి విముక్తి చెందాలంటే అప్పుడప్పుడు బాడీకి మసాజ్ అనేది తప్పనిసరి. మసాజ్ వల్ల ఎలాంటి ఒత్తిడి, ఆందోళన ఉన్న కూడా విముక్తి చెందుతారు. రోజూ మసాజ్ చేయించుకోవడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. కొందరు చిన్న విషయాలకి కూడా ఎక్కువగా ఒత్తిడికి గురవుతుంటారు. ఇలాంటి వారు మసాజ్ చేయించుకోవడం వల్ల ఎలాంటి టెన్షన్‌కి గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారు. మసాజ్ చేయించుకోవడం వల్ల పాజిటివ్ ఎనర్జీ మెరుగు అవుతుంది. నెగిటివ్ ఆలోచనల నుంచి పాజిటివ్ ఆలోచనలకు దగ్గర అవుతారు. అలాగే హాయిగా కూడా నిద్రపడుతుంది. నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్నా వారు రోజూ బాడీకి మసాజ్ చేయించుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా హాయిగా నిద్రపోతారు. అయితే మసాజ్ చేయించుకొనేటప్పుడు సరైన భంగిమలో ఉండి చేయించుకోవాలి. లేకపోతే బాడీ పెయిన్స్ కూడా కొన్నిసార్లు వచ్చే ప్రమాదం ఉంది. మసాజ్ చేయించుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోజూ ముఖాన్ని మర్దన చేస్తే కాంతివంతంగా చర్మం మారుతుంది. అలాగే జుట్టును కూడా రోజూ మసాజ్ చేయడం వల్ల ఆరోగ్యంగా, బలంగా పెరుగుతుంది. రక్తప్రసరణ బాగా జరిగి జుట్టు రాలిపోకుండా కూడా ఉంటుంది.




# అంజీర్‌లో నాన్‌వెజ్ ఉందా ?

డ్రై ఫ్రూట్స్ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో ముఖ్యమైనది అంజీర్. ఇది ఆరోగ్య సమస్యల నుండి మనల్ని రక్షిస్తుంది. ఎందుకంటే ఇందులో ఫైబర్, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. దీన్ని రోజూ తింటే ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. మీరు రోజుకు 3 నుండి 4 అంజీర్ పండ్లను తినాలి. బరువు తగ్గించడంలో అంజీర పండ్లు బాగా పనిచేస్తాయి. ఇందులో ఉండే ప్రోటీన్ ఆకలిని నివారిస్తుంది. ఫలితంగా బరువు తగ్గుతుంది. అంజీర్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. ఇది గుండె జబ్బులను కూడా నివారిస్తుంది. ఇందులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అంతే కాకుండా రక్తపోటును కూడా అదుపులో ఉంచుతుంది. అయితే తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో కారణంగా ఇప్పుడు శాకాహారులు అంజీర పండ్లను తినేందుకు వెనుకాడుతున్నారు. అసలు విషయం ఏమిటి.. అంజీర్ నిజంగా నాన్ వెజ్ అవునా కాదా అనే విషయాలను ఈ కథనంలో తెలుసుకుందాం. కొన్ని రోజుల క్రితం, నటి షెహనాజ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేసి, "అందుకే జైన్ అంజీర పండ్లు తినరు. నేను కూర్గ్‌లో నితిన్‌ను కలిసినప్పుడు, అంజీర పండ్లు పెరగడానికి ఒక చిన్న కీటకం తన జీవితాన్ని త్యాగం చేస్తుందని అతడు నాకు చెప్పారు. కందిరీగ గుడ్లు పెట్టవలసి వచ్చినప్పుడు అది అత్తి పువ్వులోకి ప్రవేశించి అక్కడ గుడ్లు పెడుతుంది. పువ్వులోకి ప్రవేశించేటప్పుడు రెక్కలు విరిగి లోపల చనిపోతాయి. దీని తరువాత అత్తి ఈ జీవి మృతదేహాన్ని జీర్ణం చేస్తుంది." అంటూ రాసుకొచ్చారు. నటి షెహనాజ్ ఇచ్చిన కోణం నుండి పరిశీలిస్తే.. బహుశా ఇది నిజం కావొచ్చు కానీ లక్షలాది శాకాహారులు దీనిని నమ్మరు. అంజీర్ పండ్లు అందజేసే ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని దాని తింటారు. అయితే, జైన మతాన్ని అనుసరించే వ్యక్తులు మాత్రం అంజీర్ పండ్లకు దూరంగా ఉంటారు. జైన మతాన్ని విశ్వసించే వ్యక్తులు అహింసను అనుసరిస్తారు. మాంసం వినియోగానికి దూరంగా ఉంటారు. ఈ సమాజంలోని చాలా మంది ప్రజలు అంజీర పండ్లను తినకపోవడానికి ఇదే కారణం. కానీ, ఇది సాధారణ శాఖాహారుల విషయంలో కాదు. చాలా మంది శాకాహారులు కందిరీగలు లోపలికి వెళ్లి అక్కడ చనిపోవడం, అంజీర్ పండ్లను పోషించడం సహజమైన ప్రక్రియ, వాళ్లు ఇలాంటివి పట్టించుకోరు. అంజీర్ పండ్లు కలుగజేసే ప్రయోజనాల కోసం వీటిని తింటారు.



# అరటి తొక్క పడేస్తున్నారా?

అరటిపండు తొక్కలను కాల్చడం వల్ల కూడా దోమలను తరిమికొట్టవచ్చు. అరటిపండు తొక్కలను పొడిచేసి అగరబత్తిలా పొగ పెడితే.. దీని వాసనకు దోమలు ఒక్క నిమిషం కూడా ఇంట్లో ఉండవు. ఇది సేంద్రీయ దోమల వికర్షకం. ఇది ఎటువంటి ఆరోగ్య ప్రమాదాలను కలిగించదు. అరటిపండు తొక్కలు తీసి బాగా మిక్స్ చేసి పేస్ట్ లా చేసుకోవాలి. ఈ పేస్టును ఇంటి మూలలకు రాస్తే దోమలు ఈ వాసనకు రావు. ఈ పీల్ పేస్ట్ దోమలను దూరంగా ఉంచుతుంది. ఇలా చేయడం వల్ల దోమల బెడద నుంచి సులభంగా బయటపడవచ్చు.దోమలను తరిమికొట్టేందుకు కూడా అరటి తొక్క బలేగా పనిచేస్తుంది. ఇంట్లో దోమలు ఎక్కువగా ఉంటే పడుకునే గంట ముందు అరటిపండు తొక్కను గదిలోని నాలుగు మూలల్లో పెట్టాలి. దీని వాసనకు దోమలు రానేరావు.ఇంట్లో దోమలను తరిమేందుకు చాలా మంది రసాయన ఉత్పత్తులను ఉపయోగిస్తారు. దీని వల్ల ఆరోగ్యానికి దుష్ప్రభావాలు ఎక్కువ. కానీ అరటిపండు తొక్కతో దోమలను సులభంగా తరిమికొట్టవచ్చని చాలా మందికి తెలియదు. అవును.. ఈ కింది చిట్కాల ద్వారా అరటి తొక్కతో తేలికగా దోమలు పారదోలవచ్చు. సాయంత్రం అయితే చాలు ఇంట్లోకి దోమలు రయ్ మంటూ వచ్చేస్తుంటాయి. నిశ్శబ్ద రక్తాన్ని పీల్చే ఈ దోమలు రకరకాల వ్యాధులను కలిగిస్తాయి. ముఖ్యంగా దోమలు కుడితే మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యూ, జికా వైరస్ వంటి అనేక వ్యాధులు వస్తాయి.



# ఒత్తిడికి గురైతే స్వీట్లు తినాలనిపిస్తుందా?



స్వీట్లు తినడం అంటే చాలా మందికి ఇష్టం ఉంటుంది. ఎవరో కొందరు లావు అవుతారని భావించి స్వీట్లు పెద్దగా తినరు. అంతే కానీ సాధారణంగా అందరూ కూడా స్వీట్లు తింటారు.అయితే వీటిలో ఉండే షుగర్ వల్ల కొందరు వీటిని తినడానికి పెద్దగా ఇష్టపెట్టుకోరు. ఇదంతా పక్కన పెడితే ఈ రోజుల్లో చాలా మంది చిన్న విషయాలకు ఎక్కువగా ఆలోచించి ఒత్తిడికి లోనవుతున్నారు. ఏద్కైనా చిన్న సమస్య వస్తే చాలు.. ఇక పెద్దగా ఆలోచించి ఆందోళన చెంది డిప్రెషన్‌లోకి వెళ్తున్నారు. అయితే కొందరు బాగా ఒత్తిడితో ఉంటే కొన్ని ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం లేకపోతే పూర్తిగా తినడం మానేస్తారు. ఎక్కువ శాతం మంది బాగా ఒత్తిడికి గురైతే కొన్ని పదార్థాలను తింటారు. అందులో ముఖ్యంగా స్వీట్లు తింటారు. సాధారణంగా వీటిని తినడానికి ఇష్టపెట్టుకోరు. కానీ బాగా ఒత్తిడికి గురైతే మాత్రం తప్పకుండా తింటారు. అసలు ఒత్తిడికి గురైతే ఎందుకు స్వీట్లు తింటారు? దీనికి గల కారణం ఏంటో తెలియాలంటే స్టోరీ మొత్తం చదివేయండి. ఒత్తిడి అనేది తప్పకుండా ప్రతీ ఒక్కరూ కూడా రుచి చూస్తారు. ఏదో ఒక సమయంలో ఒత్తిడికి గురవుతుంటారు. అయితే ఒత్తిడికి గురైనప్పుడు కార్డినల్ హార్మోన్ విడుదల అవుతుంది. ఇది శరీరంలో కొవ్వును, కార్బోహైడ్రేట్ జీవక్రియను ప్రేరేపిస్తుంది. దీంతో ఎక్కువగా తీపి పదార్థాలు తినాలనిపిస్తాయి. అయితే ఈ అలవాటు ఎక్కువగా ఉండటం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే షుగర్ అసలు ఆరోగ్యానికి మంచిది కాదు. వీటివల్ల డయాబెటిస్ రావడంతో బరువు కూడా పెరుగుతారు. అలాగే కొన్ని రకాల అనారోగ్య సమస్యలు కూడా వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఈ అలవాటు ఎక్కువ రోజులు ఉండకుండా ఈ సమస్య నుంచి బయటకు రావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఒత్తిడితో ఉన్నప్పుడు స్వీట్ తినాలనిపించిన కూడా తినవద్దని సూచిస్తున్నారు. అలా ఉండలేకపోతే ఒత్తిడికి గురికాకుండా ఉండాలని నిపుణులు అంటున్నారు. ఆహారం, నిద్ర లేకపోయిన కూడా కొందరు ఒత్తిడికి గురి అవుతుంటారు. ఇలా కాకుండా ఉండాలంటే ఒత్తిడి నుంచి విముక్తి పొందేందుకు కొన్ని చిట్కాలు పాటించాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండాలంటే చిన్న విషయాలకు ఎక్కువగా ఆలోచించకూడదు. అలాగే యోగా, మెడిటేషన్ వంటివి చేస్తుండాలి. వీటితో పాటు వ్యాయామం, రన్నింగ్ వంటివి చేయడం వల్ల కాస్త ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చు. అయితే ఇవి చేసే సమయం లేకపోతే ఎక్కువగా పుస్తకాలు చదవడం, మీకు నచ్చిన కామెడీ సీన్స్ చూడటం వంటివి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పోషకాలు ఉండే ఫుడ్ ఎక్కువగా తీసుకోవడంతో పాటు బాడీకి సరిపడా నిద్రపోవాలి. అప్పుడే ఎలాంటి సమస్యలు ఉన్నా కూడా ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారు.

www.varadhinews.com
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక


# స్టాక్ మార్కెట్లో విధ్వంసం..

వరుసగా రెండు రోజులుగా స్టాక్ మార్కెట్‌లో క్షీణత కారణంగా ఇన్వెస్టర్లు దాదాపు రూ.12 లక్షల కోట్ల మేర నష్టపోయారు. మరోవైపు, నవంబర్ నెల మొత్తం గురించి మాట్లాడుకుంటే.. ఇన్వెస్టర్ల సంపద రూ.14 లక్షల కోట్లకు పైగా తగ్గింది. సెన్సెక్స్ , నిఫ్టీ రెండూ దాదాపు రెండు వారాల్లో రెండు శాతానికి పైగా పడిపోయాయి. నిఫ్టీలో భారీ క్షీణత కనిపించింది. గత రెండు రోజులుగా స్టాక్ మార్కెట్‌లో దాదాపు రెండు శాతం క్షీణించింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రూపాయి రికార్డు స్థాయిలో పతనం, విదేశీ పెట్టుబడిదారుల ఉపసంహరణ, ద్రవ్యోల్బణం పెరుగుదల వార్తల తర్వాత స్టాక్ మార్కెట్‌లో పెద్ద క్షీణత కనిపించింది. స్టాక్ మార్కెట్ రాబోయే రోజుల్లో క్షీణతను చూడవచ్చని నిపుణులు చెబుతున్నారు. డాలర్ ఇండెక్స్ పెరగడం, స్టాక్ మార్కెట్ నుండి ఎఫ్ఐఐల ఉపసంహరణ రూపాయి పతనానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మార్కెట్ మరోసారి రూ.75 వేల స్థాయికి రావచ్చు. స్టాక్ మార్కెట్‌లో ఎలాంటి క్షీణత కనిపించిందో ఈ కథనంలో తెలుసుకుందాం. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1.25 శాతం లేదా 984.23 పాయింట్ల క్షీణతతో 77,690.95 పాయింట్ల వద్ద ముగిసింది. ట్రేడిరగ్ సెషన్‌లో సెన్సెక్స్‌లో సుమారు 1100 పాయింట్ల పతనమైంది. సెన్సెక్స్ 77,533.30 పాయింట్ల కంటే దిగువ స్థాయికి వచ్చింది. మంగళ, బుధవారాలు కలిపి పతనాన్ని పరిశీలిస్తే.. సెన్సెక్స్ 1832 పాయింట్ల పతనాన్ని చవిచూసింది. మొత్తం నవంబర్ నెలలో, సెన్సెక్స్ 1,724.92 పాయింట్లు పడిపోయింది. అంటే నవంబర్ నెలలో సెన్సెక్స్ 2.17 శాతం పడిపోయింది. మరోవైపు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ నిఫ్టీ 1.36 శాతం లేదా 324.40 పాయింట్ల క్షీణతతో 23,559.05 పాయింట్ల వద్ద ముగిసింది.




# 15న బ్యాంకులు స్టాక్ మార్కెట్‌లు పని చేయవు




గురునానక్ జయంతి సందర్భంగా ఈ వారం పనిదినాల్లో దేశంలోని అనేక బ్యాంకులకు సెలవులు ఉండబోతున్నాయి. విశేషమేమిటంటే.. ఈ రోజు కూడా స్టాక్ మార్కెట్‌కు సెలవు. నవంబర్ 15 శుక్రవారం నాడు స్టాక్ మార్కెట్, బ్యాంకులకు ఈ వారం సెలవులు ఉండబోతున్నాయి. కార్తీక పూర్ణిమ, గంగా దసరా (గంగాస్నన్) కూడా నవంబర్ 15న ఉన్నాయి. అయితే గురునానక్ జయంతి కారణంగా సెలవు ప్రకటించారు. ఏ నగరాలు, రాష్ట్రాల్లో బ్యాంకులు మూతపడతాయంటే నవంబర్ 15న మహారాష్ట్ర, మిజోరం, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, చండీగఢ్, నాగాలాండ్, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, హైదరాబాద్, జమ్ము, తెలంగాణ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, న్యూఢల్లీ, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, శ్రీనగర్ బ్యాంకులు సెలవులు ఉండబోతున్నాయి. ఈ నగరాలు, రాష్ట్రాల పౌరులు బ్యాంకులు లేదా బ్యాంకు శాఖలలో పని ఉంటే తర్వాత రోజు అంటే నవంబర్ 16వ తేదీ శనివారం చేసుకోవచ్చు. ఆ రోజు బ్యాంకులు పని చేస్తాయి. ఈ శుక్రవారం అంటే నవంబర్ 15న స్టాక్ మార్కెట్‌కు సెలవు ఉంటుంది. బీఎస్సీ, ఎన్ఎస్సీ ఎక్స్ఛేంజీలలో ట్రేడిరగ్ ఉండదు. ఇది కాకుండా, కమోడిటీ మార్కెట్, కరెన్సీ మార్పిడికి సంబంధించిన పనులు కూడా మూసివేయబడతాయి. దీని తరువాత, స్టాక్ మార్కెట్‌లో వరుసగా శని, ఆదివారం అంటే 16-17 నవంబర్‌లో వారాంతపు సెలవులు ఉంటాయి. మొత్తంగా చూస్తే 15,16,17 వరుసగా స్టాక్ మార్కెట్ మూడు రోజులు మూసివేయబడుతుంది. బ్యాంకులకు సెలవుల జాబితాలో నవంబర్ 15వ తేదీని రిజర్వ్ బ్యాంక్ ఇప్పటికే సెలవు దినంగా ప్రకటించింది. సిక్కుల మొదటి గురువు కార్తీక మాసంలోని శుక్ల పక్ష పౌర్ణమి రోజున జన్మించారు. ఈ రోజును గురునానక్ దేవ్ జయంతిగా జరుపుకుంటారు. బుధవారం, 20 నవంబర్ 2024న మహారాష్ట్రలోని బ్యాంకులకు సెలవు ఉంటుంది. స్టాక్ మార్కెట్‌లో కూడా సెలవు ఉంటుంది. ఈ రోజున మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ప్రజలు తమ ఓటు వేయడానికి పూర్తి సమయం పొందేందుకు, రాష్ట్రంలో సెలవు ప్రకటించారు.

# మస్క్ వేలకోట్ల వ్యాపార రహస్యం ఇదే..



ఎవరికి వారుగా ఉంటే విజయం సాధించే అవకాశం ఉండదు. ఐకమత్యంగా ఉంటే గెలుపులను సొంతం చేసుకోవచ్చు. వెనుకటి కాలంలో ఓ రాజు మంచానపడ్డాడు. రాజ్యం ఎవరికి ఇవ్వాలనే సందిగ్ధం ఆయనను వెంటాడుతూనే ఉంది. అయితే తన కుమారులకు ఒక పరీక్ష పెట్టాలనుకున్నాడు. అడవికి వెళ్లి పది కర్రలు తీసుకురమ్మని చెప్పాడు. అందులో ఐదు కర్రలు ఒక్కొక్కరికి ఒక్కోటి ఇచ్చాడు. వాటిని విరగొట్టమని చెప్పాడు. ఆ కుమారులు కూడా అలానే చేశారు. ఈసారి ఐదు కర్రలను ఒక కట్టగా కట్టి వారికి ఇచ్చాడు. విరగొట్టమని చెప్పాడు.. అది సాధ్యం కాలేదు..” నేను ఇప్పుడు మంచం లో పడ్డాను. ఎంతకాలం బతుకుతానో తెలియదు. మీరు నాకు ఐదుగురు కుమారులు. మీరు అందరూ నాకు సమానమే. మీరు ఐకమత్యంగా ఉంటే ఎవరు మిమ్మల్ని ఏమీ చేయలేరు. మీరు ఎవరికి వారుగా ఉంటే మాత్రం కష్టం. అది మీకు, రాజ్యానికి కూడా” అని ఆ రాజు ఉద్బోధించారు. ఆ తర్వాత ఆ ఐదుగురు ఐకమత్యంగా ఉండడం మొదలుపెట్టారు. రాజ్యాన్ని మరింతగా విస్తరించారు. పురాణ కాలంలో అంటే అలా జరిగింది.. నేటి కమర్షియల్ రోజుల్లో అది సాధ్యం కాదు. అలా ఉండడం వీలుకాదు. అయితే కొందరు వ్యాపారులు మాత్రం సంయుక్త సిద్ధాంతాన్ని పాటిస్తున్నారు. స్థూలంగా చెప్పాలంటే దానిని ప్రిన్సిపు ల్ ఆఫ్ కంబ్కెండిరగ్ అంటారు. దీని ప్రకారం ఎలాంటి విపత్తునైన ఎదుర్కోవచ్చు. వ్యాపారాన్ని విస్తరించవచ్చు. ఈ సిద్ధాంతాన్ని ప్రస్తుతం ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అమల్లో పెట్టాడు విజయం సాధించాడు. ఇటీవల అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు. ఆయన విజయంలో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కీలకపాత్ర పోషించారు. ట్రంప్ ఎన్నికల ప్రచారం కోసం 130 మిలియన్ డాలర్ల సహాయం అందించారు. ఇప్పుడు ట్రంప్ ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. వాస్తవానికి టెస్లా అధినేత మస్క్ ప్రపంచ కుబేరుడు కావడానికి ముందు.. ఒక మామూలు ఎలక్ట్రానిక్ కార్ల తయారీదారు. ఆయన దగ్గర టెక్నాలజీ మాత్రమే ఉంది. కార్లను తయారుచేసే పెద్ద పెద్ద ప్లాంట్లు లేవు. అమెరికాలో పేరుపొందిన కార్ల తయారీ సంస్థ ఫోర్డ్ కంపెనీని మస్క్ గతంలో సంప్రదించారు. అప్పట్లో ఆ కంపెనీ నష్టాల్లో ఉంది.

# క్రిప్టో కరెన్సీ మార్కెట్‌కు సరికొత్త ఊపు..



అగ్ర రాజ్యం అమెరికాకు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత క్రిప్టో కరెన్సీ మార్కెట్‌కు మంచిరోజులు వచ్చాయి. నవంబర్ 5 అధ్యక్ష ఎన్నికల ఫలితాల తర్వాత బుధవారం ప్రముఖ క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ విలువ 90,000 డాలర్లకు చేరుకుంది.సరికొత్త ఆల్‌ట్కెం రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసింది. భవిష్యత్‌లో బిట్ కాయిన్ సరికొత్త గరిష్ఠాలను తాకనుందని క్రిప్టో మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. అమెరికాను క్రిప్టో రాజధానిగా మారుస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరిగిన రోజు నుంచి ఇప్పటివరకు బిట్‌కాయిన్ విలువ 25 శాతానికి పైగా పుంజుకుంది. మరో క్రిప్టో కరెన్సీ ఈథర్ ఏకంగా 30 శాతం ఎగబాకింది. అమెరికాను క్రిప్టోల రాజధానిగా తీర్చిదిద్దుతానని, బిట్‌కాయిన్‌ల వ్యూహాత్మక నిల్వలను ఏర్పాటు చేస్తానని ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ప్రకటించారు. అంతేకాదు ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు అవసరమైన విరాళాలను క్రిప్టోల్లోనూ స్వీకరించారు. ట్రంప్ సానుకూల వైఖరితో ఈ వర్చువల్ కరెన్సీల విలువ మున్ముందు మరింత పెరగవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# పెరగనున్న కూరగాయల ధరలు



దేశంలో ఈసారి వచ్చిన పెళ్లిళ్ల సీజన్‌లో కూరగాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పెళ్లిళ్లు చేసుకునే వారు వంటల కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందని అంటున్నారు. ఇప్పటికే కిరాణా సామాగ్రి, ఆయిల్ ధరలు కూడా చాలా పెరిగాయి. ఎందుకంటే ఇటీవల వచ్చిన నివేదికలో రిటైల్ ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. భారతదేశ రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.49 శాతం నుంచి అక్టోబర్‌లో 14 నెలల గరిష్ఠ స్థాయి 6.21 శాతానికి పెరిగింది. పెరుగుతున్న కూరగాయల ధరల నేపథ్యంలో ఆహార ద్రవ్యోల్బణం గత నెలలో 9.2 శాతం నుంచి 10.87 శాతానికి చేరుకుంది. అయితే దీనికి ప్రధాన కారణం కూరగాయల ధరలు 42.18 శాతం పెరగడమేనని నిపుణులు అంటున్నారు. పచ్చికూరగాయల ధరలు గతం కంటే స్వల్పంగా తగ్గాయి. కానీ వెల్లుల్లి, బంగాళదుంప వంటి తదితర ధరలు మాత్రం నిలకడగా ఉన్నాయి. ఇవి మరికొన్ని రోజుల్లో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇదే సమయంలో డ్రైఫ్రూట్స్ ధరలు కూడా పెరగడం విశేషం. ఇక బంగారం ధరల విషయానికి వస్తే పెళ్లిళ్ల సీజన్ ఉన్న నేపథ్యంలో అనేక మంది ముందే బుక్ చేసుకున్నారు. ఈ క్రమంలో వీటి ధరలు గతంలో కంటే తగ్గే ఛాన్స్ ఉందని చెబుతున్నారు. దీపావళి నాటికి కిలో వెండి ధర రూ. 99 వేలకు చేరుకోగా, 10 గ్రాముల బంగారం ధర రూ. 82-83 వేలకు చేరుకుంది. ప్రస్తుతం వెండి ధర కిలో రూ. 90-91 వేలకు తగ్గగా, బంగారం ధర కూడా 10 గ్రాములు రూ.78 వేల స్థాయికి చేరుకుంది. అందువల్ల తగ్గిన రేట్ల ప్రయోజనం ముందుగా కొనుగోలు చేసిన వారికి లభించలేదని చెప్పవచ్చు. అయితే మరికొన్ని రోజుల్లో బంగారం ధరలు మాత్రం పెరిగే అవకాశం లేదని పలువురు చెబుతుండగా, మరికొంత మంది మాత్రం పెరుగుతాయని అంటున్నారు.

# ఐసీఐసీఐ క్రెడిట్ కార్డు యూజర్లకు అలెర్ట్..

## ఆ కీలక చార్జీల సవరణ



ఐసీఐసీఐ బ్యాంకు నవంబర్ 15, 2024 నుంచి వర్తించే క్రెడిట్ కార్డ్ హెూల్డర్‌లకు బ్యాంక్ తన కొత్త ఛార్జీలను ప్రకటించింది. ఆలస్య చెల్లింపులు, ఇంధన చెల్లింపులు, యుటిలిటీ చెల్లింపులతో సహా ఛార్జీలను బ్యాంక్ సవరించింది. కొత్త మార్గదర్శకాలలో, ఇంధన లావాదేవీల మొత్తం రూ. 50,000 దాటితే లావాదేవీలో 1 శాతాన్ని బ్యాంకు వసూలు చేస్తుంది. అలాగే క్రెడిట్ కార్డ్‌ని ఉపయోగించి నేరుగా పాఠశాల, కళాశాల లేదా ఏదైనా అంతర్జాతీయ చెల్లింపు చేసినట్లయితే బ్యాంక్ ఛార్జీ విధించదు. కానీ ఏదైనా అనధికారిక లేదా థర్డ్-పార్టీ గేట్‌వే ద్వారా చెల్లింపు జరిగితే బ్యాంక్ ఛార్జ్ విధిస్తుంది. రూ. 50,000 కంటే ఎక్కువ యుటిలిటీ చెల్లింపు లావాదేవీల కోసం లావాదేవీ మొత్తంలో 1 శాతం రుసుము వసూలు చేస్తారు. బ్యాంకు శాఖలలో నగదు చెల్లింపుపై రుసుములు, ఇంధన సర్‌చార్జిలు, అద్దె-చెల్లింపు ఎంపికలు వంటి అనేక లావాదేవీల కోసం ఎటువంటి మార్పులు చేయలేదు. అలాగే మీరు ఐసీఐసీఐ బ్యాంక్ బ్రాంచ్‌లలో ఒకదానిలో క్రెడిట్ కార్డు బిల్లును నగదు రూపంలో చెల్లింపు చేసినప్పుడు బ్యాంక్ రూ. 100 వసూలు చేస్తుంది. అలాగే ఇందన లావాదేవీలు చేసినప్పుడు మీరు లావాదేవీ విలువలో 1 శాతం లేదా రూ. 10, ఏది ఎక్కువైతే అది సర్‌ఛార్జ్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అయితే, మీరు ఇంధన లావాదేవీల కోసం మీ అమెజాన్ పే కార్డ్‌ని ఉపయోగిస్తే ఈ సర్‌ఛార్జ్ పూర్తిగా మినహాయిస్తారు. అలాగే ఆఫ్-యూస్ టెర్మినల్‌లో ఇంధనాన్ని కొనుగోలు చేస్తే, సర్‌ఛార్జ్ రివర్సల్‌లో వస్తువులు, సేవల పన్ను ఉండదని గమనించాలని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెబుతున్నారు.

# జియో కస్టమర్స్‌కు బంపర్ ఆఫర్..




దేశంలోని ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో తన వినియోగదారుల కోసం అనేక ప్లాన్‌లను అందిస్తోంది. కంపెనీ పోర్ట్‌ఫోలియో కస్టమర్ల అవసరాలకు అనుగుణంగా విభిన్న ప్రయోజనాలతో కూడిన ప్లాన్‌లను కలిగి ఉంది.ఇప్పుడు వినియోగదారుల సౌలభ్యం కోసం కంపెనీ కొత్త డేటా ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. ఈ ప్లాన్‌లో పరిమిత సమయం వరకు హై స్పీడ్ ఇంటర్నెట్ డేటా వినియోగదారులకు అందించబడుతుంది. జియో తాజా ప్లాన్ గురించి తెలుసుకుందాము. జియో ఈ ప్రీపెయిడ్ ప్లాన్ రూ.11. ఇది అధికారిక వెబ్‌సైట్‌లో జాబితా చేయబడిరది. ఈ ప్లాన్‌లో, వినియోగదారులకు 1 గంట పాటు హై స్పీడ్ ఇంటర్నెట్ అపరిమిత డేటా అందించబడుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ డేటా అవసరమయ్యే కస్టమర్లకు ఈ ప్లాన్ ఉత్తమమైనది. ఈ ప్లాన్‌లో, వినియోగదారులు అధిక వేగంతో 10 జీబీ డేటాను పొందుతారు. 10 జీబీ డేటా అయిపోయిన తర్వాత వేగం తగ్గుతుంది. జియో కొత్త డేటా ప్లాన్ రూ.11 ధరతో ప్రారంభించబడిరది. ఈ ప్లాన్‌లో కస్టమర్‌లు 1 గంట వాలిడిటీని పొందుతారు. ఈ ప్లాన్ కోసం జియో వినియోగదారుల బేస్ ప్లాన్ ఇప్పటికే యాక్టివ్‌గా ఉండటం అవసరం. ఈ ప్లాన్‌లో, వినియోగదారులు 10 జీబీ డేటాను పొందుతారు. అయితే, వినియోగదారులు ఈ డేటాను కేవలం ఒక గంటలో ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ ప్లాన్ కొన్ని భారీ ఫైల్‌లు లేదా గేమ్‌లను డౌన్‌లోడ్ చేసేటప్పుడు వినియోగదారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. జియో రీఛార్జ్ పోర్ట్‌ఫోలియోలో మరిన్ని డేటా ప్లాన్‌లు ఉన్నాయి. జియోతో పాటు ఎయిర్టెల్, ఇతర టెలికాం కంపెనీలు కూడా వినియోగదారులకు డేటా ప్లాన్‌లను అందిస్తున్నాయి.

11
శుక్రవారం
15.11.2024
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
SPORTS
క్రీడలు



# రోహిత్, కోహ్లి కొత్తగా మొదలెట్టాలి

## ఆస్ట్రేలియా పేస్ దిగ్గజం బ్రెట్ లీ

ప్రతిష్ఠాత్మక బోర్డర్- గావస్కర్ సిరీస్‌కు సమయం దగ్గర పడుతుండటంతో చర్చలన్నీ దీని చుట్టూనే సాగుతున్నాయి. సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో సిరీస్‌లో టీమ్‌ఇండియా వైట్‌వాష్ నేపథ్యంలో కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఆసీస్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తారోననే ఆసక్తి నెలకొంది. వీళ్లు గత ప్రదర్శనలను మర్చిపోయి, మళ్లీ కొత్తగా మైదానంలో అడుగుపెట్టాలని ఆస్ట్రేలియా పేస్ దిగ్గజం బ్రెట్ లీ సూచించాడు. "వరుసగా పేలవ ప్రదర్శన చేస్తుంటే ఒత్తిడి పెరుగుతుంది. విరాట్, రోహిత్ పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉందనుకుంటున్నా. ఈ ఇద్దరూ తమ ఆటను సమీక్షించుకోవాలి. మిగతావాళ్ల కంటే ప్రాథమిక అంశాలపై మంచి పట్టున్న వీళ్లు ఛాంపియన్ ఆటగాళ్లు.. వీళ్లు టెక్నిక్‌పై దృష్టి పెట్టి, సరికొత్తగా మైదానంలో అడుగుపెట్టాలి. ఎందుకంటే కొత్త బంతితో ఆసీస్ పేసర్లు కచ్చితంగా సవాలు విసురుతారు" అని అతను చెప్పాడు. ఈ ఏడాది 11 టెస్టుల్లో 29.40 సగటుతో రోహిత్ 588 పరుగులు చేయగా.. కోహ్లి 6 టెస్టుల్లో 22.72 సగటుతో 250 పరుగులు సాధించాడు. "ఈ ఇద్దరు ఎందుకు విఫలమవుతున్నారో చెప్పడం కష్టమే. రోహిత్ ఎక్కువగా పేసర్లకే వికెట్లు సమర్పించుకున్నాడు. గత దశాబ్ద కాలంగా అతని ఆట చూస్తున్న కాబట్టి టెక్నిక్‌లో లోపం ఉందనుకోను. ప్రపంచ క్రికెట్లో పుల్‌షాట్ ఆడే అత్యుత్తమ ఆటగాళ్లలో అతనొకడు అని ఇప్పటికీ భావిస్తున్నా. కానీ కాస్త ఎక్కువగా దూకుడు ప్రదర్శించడం చేటు చేస్తుందేమో" అని బ్రెట్ లీ పేర్కొన్నాడు.

# స్మిత్‌ను ఆపే మార్గాలు కనిపెట్టా : రవిచంద్రన్ అశ్విన్

బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా ప్రధాన ఆటగాడు స్టీవ్ స్మిత్‌ను ఆపే మార్గాలు కనిపెట్టానని, అతణ్ని కట్టడి చేస్తానని టీమ్‌ఇండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ధీమా వ్యక్తం చేశాడు."స్మిత్ ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను బాగా ఆడతాడు. విలక్షణమైన టెక్నిక్ ఉన్న అతను ఫాస్ట్‌బౌలింగ్‌లోనూ ఉత్తమ ప్రదర్శన చేస్తాడు. కానీ స్పిన్ విషయానికి వచ్చే సరికి అతని ఆట ప్రణాళికలు, సన్నాహకాలు మరింత పటిష్ఠంగా ఉంటాయి. అయితే కొన్నేళ్లుగా అతణ్ని కట్టడి చేసేందుకు మార్గాలు కనుగొంటూనే ఉన్నా. ఐపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్, రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌కు కలిసి ఆడినప్పుడు నెట్స్‌లో అతని బ్యాటింగ్ చూశా. అతను ఎలా సన్నద్ధమవుతున్నాడో గమనించా.



అతనికి ఎలా బౌలింగ్ చేస్తే ఇష్టం ఉండదో తెలుసుకున్నా. అతను ఎక్కువగా ఆలోచించే క్రికెటర్. ఎప్పుడూ ఆధిపత్యం ప్రదర్శించాలనుకుంటాడు. కొన్నిసార్లు నా బౌలింగ్‌లోనూ పెత్తనం చలాయించాడు. కానీ ఆ తర్వాత అతని బ్యాటింగ్ శైలిని అర్థం చేసుకుని నేను ఆధిపత్యం ప్రదర్శించడం మొదలెట్టా" అని అశ్విన్ చెప్పాడు. ఆస్ట్రేలియాలో తొలిసారి 2013-14 పర్యటనలో స్మిత్‌కు అశ్విన్ బౌలింగ్ చేశాడు. అశ్విన్ బౌలింగ్‌లో 570 బంతుల్లో 348 పరుగులు చేసిన స్మిత్ మూడు సార్లు ఔటయ్యాడు.

# ఇండియన్ క్రికెట్ హిస్టరీలో సంజూ ఒక్కడే?



స్టార్ క్రికెటర్ సంజు శాంసన్ తాజాగా టీ20 క్రికెట్‌లో ఒక చెత్త రికార్డును సృష్టించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో కేవలం రెండు బంతులు ఆడి డకౌట్ అయ్యారు. అంటే, ఆయన ఏ పరుగులు చేయలేకపోయారు. అయితే, ఈ సిరీస్‌లో ముందుగా ఆయన అద్భుతంగా ఆడాడు. మొదటి మ్యాచ్‌లో కేవలం 50 బంతుల్లో 107 పరుగులు చేసి శతకం సాధించారు. ఇలా వరుసగా రెండు టీ20 మ్యాచ్‌లలో శతకం చేసిన మొదటి భారతీయ క్రికెటర్‌గా ఆయన నిలిచారు. సంజు శాంసన్ అద్భుతంగా ఆడిన తర్వాత, ఆయన ఫామ్ పూర్తిగా తగ్గిపోయింది. గిబర్హా, సెంటురియన్ మ్యాచ్‌లలో వరుసగా రెండు బంతుల్లోనే ఔట్ అయ్యారు. ఇలా వరుసగా రెండు శతకాలు చేసి, తర్వాత వరుసగా రెండు బంతుల్లో డక్ ఔట్ అయిన ఘటన టీ20 క్రికెట్ చరిత్రలో ఇంతకు ముందు జరగలేదు. ఈ రికార్డును సృష్టించిన మొదటి బ్యాట్స్‌మన్ సంజు శాంసన్ అయ్యాడు. 2024 సంవత్సరంలో సంజు శాంసన్‌కు మిశ్రమ ఫలితాలే వచ్చాయి. ఒకే సంవత్సరంలో అత్యధిక సార్లు డక్ అవుట్ అయిన భారతీయ బ్యాట్స్‌మన్‌గా ఆయన రికార్డును సృష్టించారు. ఆయన 5 సార్లు డక్ అవుట్ అయ్యారు. మొత్తంగా టీ20 క్రికెట్‌లో ఆయన 6 సార్లు డక్ అవుట్ అయ్యారు. భారతీయ ఆటగాళ్లలో రోహిత్ శర్మ (12 సార్లు), విరాట్ కోహ్లి (7 సార్లు) తర్వాత ఈ రికార్డులో మూడవ స్థానంలో ఉన్నారు. సంజు శాంసన్ తన 30వ పుట్టినరోజును నవంబర్ 11న జరుపుకున్నారు. కానీ ఈ కొత్త దశలో అతని ప్రదర్శనలు అంతంత మాత్రమే ఉన్నాయి. ఇటీవల కాలంలో అతను కొన్ని మ్యాచ్‌లలో బాగా ఆడాడు. ఈ ఏడాదిలో ఆడిన ఆరు మ్యాచ్‌లలో దాదాపు 43 సగటుతో 257 పరుగులు చేశాడు.

# అరుదైన ఘనతకు చేరువలో అర్ష్‌దీప్‌సింగ్!

దక్షిణాఫ్రికాతో జరుగుతున్న నాలుగు మ్యాచ్ ల టి20 సిరీస్ లో ఇప్పటికే మూడు మ్యాచ్లు పూర్తయ్యాయి. భారత్ 2-1 తేడాతో లీడ్ లో ఉంది. ముఖ్యంగా మూడో మ్యాచ్ లో తిలక్ వర్మ 107 పరుగులు చేసి సత్తా చాటగా.. అర్ష్ దీప్ సింగ్ మూడు వికెట్లు తీసి అదరగొట్టాడు. ఈ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా ఆటగాడు జాన్సన్ విధులు సృష్టించాడు. 17 బంతుల్లోనే 54 రన్స్ చేశాడు. హార్దిక్ పాండ్యా వేసిన 19 ఓవర్లో ఏకంగా 26 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సిక్స్ లు, మూడు ఫోర్లు ఉన్నాయి. ఈ దశలో టీమిండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ అర్ష్ దీప్ సింగ్ కు 20 ఓవర్ బౌలింగ్ బాధ్యతలు అప్పగించాడు. రెండో టి20లో అర్ష్ దీప్ సింగ్ ధారాళంగా పరుగులు ఇచ్చిన నేపథ్యంలో.. సూర్య కుమార్ యాదవ్ తీసుకున్న నిర్ణయం పట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇక మూడో మ్యాచ్ లోనూ చివరి ఓవర్ అర్ష్ దీప్ సింగ్ కు ఇవ్వడం పట్ల సూర్యకుమార్ యాదవ్ నిర్ణయాన్ని కామెంట్రీ బాక్స్ లో ఉన్న వ్యాఖ్యతలు తప్పు పట్టారు. అయితే ఆ నిర్ణయం సరైనదేనని అర్ష్ దీప్ సింగ్ నిరూపించాడు. ప్రమాదకరమైన జాన్సన్ ను వికెట్ల ముందు దొరకబుచ్చుకొని ఔట్ చేశాడు. ఫలితంగా టీమిండియా విజయం సాధించింది. మూడవ టి20 మ్యాచ్లో టీమ్ ఇండియా సాధించిన విజయంలో సగం బాధ్యత బ్యాటింగ్ ద్వారా తిలక్ వర్మ నెరవేర్చితే.. మిగతా బాధ్యతను అర్ష్ దీప్ సింగ్ పూర్తి చేశాడు. తద్వారా టీమిండియా ఉత్కంఠ పరిస్థితుల్లో.. 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. ప్రస్తుతం జరుగుతున్న దక్షిణాఫ్రికా సిరీస్లో అర్ష్ దీప్ సింగ్ ఐదు వికెట్లు సొంతం చేసుకున్నాడు.. టీమిండియా స్పిన్ బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శిస్తున్న వేళ అతడు ఈ వికెట్లు సాధించడం ఒకరకంగా గొప్పే అనుకోవచ్చు. అయితే ఈ ఐదు వికెట్లు సాధించడం ద్వారా అర్ష్ దీప్ సింగ్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ టి20 క్రికెట్లో భారత జట్టు తరఫున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ గా యజువేంద్ర చాహల్ మొదటి స్థానంలో ఉన్నాడు. ఇతడు



80 మ్యాచ్లలో 96 వికెట్లు పడగొట్టాడు.. ఆ తర్వాత స్థానంలో అర్ష్ దీప్ సింగ్ కొనసాగుతున్నాడు. అతడు 59 మ్యాచ్లలో 92 వికెట్లు సాధించాడు. బుధవారం దక్షిణాఫ్రికా తో జరిగిన మూడవ టి20 మ్యాచ్లో మూడు వికెట్లు పడగొట్టడం ద్వారా అర్ష్ దీప్ సింగ్ భువనేశ్వర్ కుమార్ రికార్డును బద్దలు కొట్టాడు. భువనేశ్వర్ కుమార్ ప్రస్తుతం మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇతడు 87 మ్యాచులు ఆడి 90 వికెట్లు పడగొట్టాడు. నాలుగో స్థానంలో బుమ్రా కొనసాగుతున్నాడు. ఇతడు 70 మ్యాచ్లలో 89 వికెట్లు సాధించాడు. ఇక ఐదవ స్థానంలో హార్దిక్ పాండ్యా కొనసాగుతున్నాడు.



# ఐసీసీ ర్యాంకింగ్స్.. నంబర్.1 పాక్ బౌలర్..

ఇటీవల పాకిస్థాన్ జట్టు ఆస్ట్రేలియాను 2-1తో ఓడిరచి వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. ఈ విజయంలో షాహీన్ షా అఫ్రిది కీలక పాత్ర పోషించాడు. రెండో, మూడో మ్యాచ్‌లలో అతను వరుసగా 3/26, 3/32 వికెట్లు పడగొట్టాడు. ఈ అద్భుత ప్రదర్శనతో అతను ఐసీసీ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి నంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం అతని రేటింగ్ 696. దక్షిణాఫ్రికా బౌలర్ కేషవ్ మహరాజ్ మూడవ స్థానానికి పడిపోయాడు. జస్ప్రీత్ బుమ్రా 6వ స్థానానికి పతనమయ్యాడు. పాకిస్థాన్ జట్టు ఆటగాడు హారిస్ రౌఫ్ కూడా ఈ సిరీస్‌లో అద్భుతంగా ఆడాడు. రెండో మ్యాచ్‌లో 5/29 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనతో అతను 14 స్థానాలు ఎగబాకి 13వ స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం అతని రేటింగ్ 618. వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ 18 నెలల తర్వాత బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్-10లోకి తిరిగి వచ్చాడు. ఇంగ్లాండ్‌పై సిరీస్ గెలుపొందడంలో ఆయన కీలక పాత్ర పోషించడంతో రెండు స్థానాలు ఎగబాకి 10వ స్థానానికి చేరుకున్నాడు. ఆయన రేటింగ్ 665కి చేరుకుంది. మూడో మ్యాచ్‌లో శతకాలు చేసిన కీసీ కార్టీ, బ్రాండన్ కింగ్ కూడా తమ కెరీర్‌లో అత్యుత్తమ స్థానాలను చేరుకున్నారు. కార్టీ ప్రస్తుతం 52వ స్థానంలో ఉండగా, కింగ్ 71వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్‌కు చెందిన మ్యాథ్యూ ఫోర్డ్ సిరీస్ ఫైనల్‌లో 3/35 వికెట్లు పడగొట్టి టాప్-100 బౌలర్ల జాబితాలో 94వ స్థానానికి చేరుకున్నాడు. బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్ మధ్య జరిగిన సిరీస్‌లో, నజముల్ హొస్సైన్ 11 స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి చేరుకున్నాడు. పాకిస్తాన్‌కు చెందిన మొహమ్మద్ రిజ్వాన్‌తో ఆయన సమాన స్థానంలో ఉన్నాడు. మహ్మదుల్లా 10 స్థానాలు ఎగబాకి 44వ స్థానానికి చేరుకున్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ మార్ష్‌తో ఆయన సమాన స్థానంలో ఉన్నాడు. మెహదీ హసన్ మీరాజ్ బౌలర్ల జాబితాలో తొమ్మిది స్థానాలు మెరుగుపరచుకుని 23వ స్థానానికి చేరుకున్నాడు. అఫ్ఘనిస్తాన్‌కు చెందిన మొహమ్మద్ నబీ టాప్ ఆల్‌రౌండర్‌గా కొనసాగుతున్నాడు.



# ఆస్ట్రేలియా మాజీలు మైండ్ గేమ్ మొదలుపెట్టారు..

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ కంటే ముందు టీమిండియా స్వదేశంలో న్యూజిలాండ్ జట్టుతో మూడు టెస్టులు ఆడిరది. టీమిండియా టెస్ట్ చరిత్రలో తొలిసారి వైట్ వాష్ కు గురైంది. ఈ ఓటమి నేపథ్యంలో టీమిండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్స్ వెళ్లే అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. ఇప్పటిదాకా ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్ లో మొదటి స్థానంలో ఉన్న టీమ్ ఇండియా ఒక్కసారిగా రెండవ స్థానానికి పడిపోయింది. అంతేకాదు టీమ్ ఇండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ ఫైనల్స్ లోకి వెళ్లాలంటే ఆస్ట్రేలియాపై 4-0 తేడాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ గెలవాల్సి ఉంటుంది. అయితే ఈ సిరీస్ నవంబర్ 22 నుంచి పెర్త్ వేదికగా మొదలవుతుంది. తొలి టెస్ట్ మొదలుకాకముందే ఆస్ట్రేలియా మాజీ ఆటగాళ్లు, సీనియర్లు టీమ్ ఇండియా ప్లేయర్లపై మైండ్ గేమ్ మొదలుపెట్టారు.. ఇప్పటికే ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఫామ్ పై సంచలన వ్యాఖ్యలు చేశాడు.."విరాట్ కొంతకాలంగా సరైన క్రికెట్ ఆడటం లేదు. అతడి నుంచి సెంచరీలు తగ్గిపోయాయి. గతంలో అతడు బీభత్సంగా బ్యాటింగ్ చేసేవాడు. ఇప్పుడు మాత్రం తేలిపోతున్నాడు. ఇటీవలి న్యూజిలాండ్ సిరీస్లో అతడి గణాంకాలు ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయని" పాంటింగ్ వ్యాఖ్యానించాడు. పాంటింగ్ చేసిన వ్యాఖ్యలపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.."విరాట్ ఎలా ఆడతాడో మాకు తెలుసు. అతని ఫామ్ గురించి ఆందోళన అవసరం లేదు. అతడు తన లయను దొరకబుచ్చుకోవడం పెద్ద కష్టం కాదని" గంభీర్ వ్యాఖ్యానించాడు. ఇక మరోవైపు ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ కెర్రి ఓ కీఫె కూడా విరాట్ పై విమర్శలు చేశాడు.


# అజేయ సెంచరీతో విజృంభణ

భారత యువ క్రికెటర్ తిలక్‌వర్మ దుమ్మురేపాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో అజేయ సెంచరీతో కదంతొక్కాడు. ఫామ్‌లేమితో ఇన్ని రోజులు తడబడ్డ తిలక్..సఫారీల పనిపట్టాడు. సహచరులు విఫలమైన చోట తన విలువ చాటుకుంటూ ధనాధన్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ సెంచూరియన్‌లో తన టీ20 కెరీర్‌లో తొలి సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. తిలక్‌కు తోడు అభిషేక్‌శర్మ రాణింపుతో భారత్ తొలుత 219 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్యఛేదనలో సఫారీలు పోరాడి ఓడారు. దక్షిణాఫ్రికాను జాన్సెన్ ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. ఫలితంగా నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమ్‌ఇండియా 2-1తో ఆధిక్యంలో నిలిచింది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య టీ20 పోరు రసవత్తరంగా సాగుతున్నది. బుధవారం ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ సేన 11 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం సాధించింది. తొలుత భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. తిలక్ వర్మ(56 బంతుల్లో 107 నాటౌట్, 8ఫోర్లు, 7సిక్స్‌లు) శతకానికి తోడు అభిషేక్ శర్మ (25 బంతుల్లో 50, 3 ఫోర్లు, 5 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో మెరవడంతో టీమ్‌ఇండియా భారీ స్కోరు సాధించింది. వీరిద్దరు రెండో వికెట్‌కు 107 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సిమిలేన్(2/34), మహారాజ్(2/36) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 208/7 పరుగులు చేసింది. జాన్సెన్(17 బంతుల్లో 54, 4ఫోర్లు, 5సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నా.. జట్టును గెలుపు తీరాలకు చేర్చలేకపోయాడు. అర్ష్‌దీప్‌సింగ్(3/37), చక్రవర్తి(2/54) రాణించారు.



వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com


## కడపకు వెళ్లనున్న రాంచరణ్.. కారణమిదే..!



టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ప్రస్తుతం గేమ్ ఛేంజర్ సినిమాతో ఫుల్ బిజీగా ఉన్నాడని తెలిసిందే. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లోస్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటికే ప్రమోషనల్ ప్లాన్‌తో ఫుల్ బిజీగా ఉంది గేమ్ ఛేంజర్ టీం. కాగా రాంచరణ్ ప్రఖ్యాతి గాంచిన ఏపీలోని కడప దర్గాను సందర్శించనున్నాడు. తాజా సమాచారం ప్రకారం నవంబర్ 18న జరుగనున్న 80వ దర్గా నేషనల్ ముషైరా ఘజల్ ఈవెంట్‌కు రాంచరణ్ ముఖ్యఅతిథిగా హాజరుకాబోతున్నాడు. ఈవెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలపై త్వరలోనే క్లారిటీ రానుందని టాక్. మరోవైపు రాంచరణ్ ఉప్పెన డైరెక్టర్ బుచ్చిబాబు సానతో చేయబోయే ఆర్‌సీ 16 షూటింగ్‌లో జాయిన్ కావాల్సి ఉంది. ఆర్‌సీ 16 మైసూర్ షెడ్యూల్‌కు సంబంధించిన కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది. గేమ్ ఛేంజర్‌లో బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాజోలు సుందరి అంజలి, నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరు-స్తున్నారు. ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.




## పుష్ప 2 భారీ ప్రమోషనల్ ప్లాన్ రెడీ

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ కాంపౌండ్ నుంచి వస్తోన్న ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని 2024 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారని తెలిసిందే. ఈ నేపథ్యంలో భారీ ప్రమోషనల్ ప్లాన్ రెడీ చేశారు. ఈ నెల 17న పాట్నాలోని గాంధీ మైదాన్ సాయంత్రం 5 గంటల నుంచి పుష్ప ది రూల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త పోస్టర్ షేర్ చేశారు మేకర్స్. మొత్తానికి పుష్పరాజ్ మేనియా ఈ సారి గట్టిగానే ఉండబోతుందని తాజా పోస్టర్ చెప్పకనే చెబుతోంది. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## అమిర్‌ఖాన్‌ను కలవనున్న దిల్‌రాజ్ భారీ ప్రాజెక్టుకు ప్లాన్



టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు హిందీలో పలు సినిమాలు తెరకెక్కించాడని తెలిసిందే. అంతేకాదు ఇటీవలే బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్‌ను కలిసి ఓ ప్రాజెక్ట్ చేసే విషయమై చర్చించినట్టు వార్తలు తెరపైకి వచ్చాయి. టాలీవుడ్ లీడింగ్ డైరెక్టర్ వంశీపైడిపల్లి ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. కాగా వంశీపైడిపల్లి ఇటీవలే అమీర్ ఖాన్‌కు సినిమా లైన్‌ను వినిపించగా.. ఎక్జయిట్ అయిన అమీర్ ఖాన్ పూర్తి స్క్రిప్ట్‌తో రావాలని సూచించాడట. తాజాగా దీనికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. వంశీపైడిపల్లి స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశాడని.. త్వరలోనే దిల్ రాజుతో కలిసి ముంబైలో అమీర్‌ఖాన్‌ను కలువబోతున్నాడని బీటౌన్ సర్కిల్‌తోపాటు టాలీవుడ్‌లో వార్త ఒకటి హల్ చల్ చేస్తోంది. ఒకవేళ ఈ ప్రాజెక్టు ఒకే అయితే మాత్రం దిల్ రాజు హోం బ్యానర్‌లో వంశీపైడిపల్లి- అమీర్ ఖాన్ కాంబోలో రాబోయే భారీ డీల్ అని చెప్పక తప్పదు. మరి ఈ క్రేజీ ప్రాజెక్టుపై రాబోయే రోజుల్లో అధికారిక ప్రకటన ఏదైనా వస్తుందేమో చూడాలంటున్నారు సినీ జనాలు. ఇంతకీ దిల్ రాజు ఎలాంటి సినిమా ప్లాన్ చేశాడోనని ఇండస్ట్రీ సర్కిల్‌లో ఆసక్తికర చర్చ నడుస్తోంది.

## నా దగ్గర ఆరు స్క్రిప్టులున్నాయి : డైరెక్టర్ శివ

కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శివ కాంపౌండ్ నుంచి వచ్చిన చిత్రం కంగువ. పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రంలో సూర్య టైటిల్ రోల్‌లో నటించగా.. బాలీవుడ్ భామ దిశాపటానీ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. బాబీ డియోల్ కీలక పాత్ర పోషించిన ఈ మూవీ తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదలైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిక్స్ డ్ టాక్ తెచ్చుకుంటోంది. కాగా ఇదిలా ఉంటే ప్రమోషనల్ ఇంటర్వ్యూలో శివ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. రాబోయే రోజుల్లో భారీ ప్రాజెక్టులను నిర్మించే ప్లాన్ చేస్తున్నట్టు చేస్తున్నట్టు చెప్పాడు. కంగువలా ఔట్ ఆఫ్ ది బాక్స్ కాన్సెప్ట్‌తో ఐదు నుంచి ఆరు స్క్రిప్టులు నా దగ్గరున్నాయి. అవన్నీ డిఫరెంట్ జోనర్‌లో ఆసక్తికర నేపథ్యాలుంఆయి. దేవుడి ఆశీస్సులతో ఆ సినిమాలు చేస్తానని క్లారిటీ ఇచ్చాడు శివ. ఒకవేళ కంగువ అన్ని భాషల్లో బాగా వర్కవుట్ అయితే.. అది శివ ఇతర ఇండస్ట్రీల యాక్టర్లలో సినిమాలు చేసేందుకు ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిన కంగువ ఫ్రెంచ్, స్పానిష్, ఇంగ్లీష్ సహా ఎనిమిది భాషల్లో గ్రాండ్‌గా విడుదలైంది. ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. కంగువ చిత్రాన్ని నైజాం ఏరియాలో పాపులర్ టాలీవుడ్ ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేయగా.. ఓవర్సీస్ విషయానికొస్తే నార్త్ అమెరికాలో, యూకేలో యశ్ రాజ్ ఫిలిమ్స్ , సింగపూర్‌లో హోం స్క్రీన్, గల్ఫ్ దేశాల్లో రిలీజ్ చేశాయి. కంగువ బాక్సాఫీస్ కలెక్షన్లు ఎలా ఉండబోతున్నాయన్నది తెలియాల్సి ఉంది.



## రౌడీ బాయ్.. శ్రీలీలతో భారీ కాంబినేషన్

### వీడి.12తో ప్రేక్షకుల ముందుకు..?

రౌడీ బాయ్ 'విజయ్ దేవరకొండ' హీరోగా గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న సినిమా 'వీడి12'. ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్ గా నటిస్తోంది. 2025 సమ్మర్‌లో రిలీజ్ కానున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే రిలీజైన ఓ పోస్టర్‌లో విజయ్ దేవరకొండ లుక్ అందరిని తెగ ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే మూవీ టీమ్ అప్డేట్స్‌తో హైప్ క్రియేట్ చేయాలనీ భావిస్తోంది. అయితే ఈ చిత్ర మేకర్స్ చేసిన ప్లాన్‌కి మీ మైండ్ బ్లైండ్ కావాల్సిందే. ఇంతకీ ఈ మూవీ మేకర్స్ ఎం ప్లాన్ చేశారంటే.. ఈ సినిమా టైటిల్ కూడా ఇంకా రివీల్ కాకపోవడంతో మేకర్స్ టైటిల్ టీజర్‌ని విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈ టీజర్‌కి గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణని వాయిస్ ఓవర్ ఇచ్చేందుకు సంప్రదించారట మేకర్స్. దీనికి ఆయన కూడా సానుకూలంగా స్పందించారట. దీంతో రౌడీ బాయ్ ప్లస్ గాడ్ ఆఫ్ మాసెస్ కాంబినేషన్‌లో టీజర్ ఊహించుకుంటేనే గూస్ బంప్స్ వస్తున్నాయి అంటున్నారు ఫ్యాన్స్. 'మళ్ళీ రావా', 'జెర్సీ' వంటి సినిమాలతో ఫీల్ గుడ్ ఎమోషనల్ సినిమాలు అందించిన గౌతమ్ తిన్ననూరి ఈ సారి యాక్షన్ జోనర్ లోకి షిఫ్ట్ అయ్యాడు. ఈ సినిమా పోస్టర్ చూస్తేనే




తెలిసిపోతుంది. ఇక విజయ్ దేవరకొండ కూడా ఈ సినిమాపై ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నాడు. ఇది మంచి కంబ్యాక్ ఫిల్మ్ కాబోతుందని విశ్లేషకుల మాట. ఈ గ్యాప్‌లో గౌతమ్ మరో చిన్న ప్రాజెక్ట్ తో థియేటర్ల ముందుకి రానున్నాడు. నూతన నటీనటులతో 'మ్యూజిక్' అనే సరికొత్త చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ చివర్లో తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ.. వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాకి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందించనుండటం విశేషం.

## కిల్లర్ ఫోజులతో కిక్కెస్తోన్న నయనతార

కిల్లర్ ఫోజులతో కిక్కెస్తోన్న హీరోయిన్.. ఇన్నాళ్లకు మత్తెక్కించే ఫోటోస్ షేర్ చేసి అభిమానులకు షాకిచ్చింది ఓ హీరోయిన్. వెండితెరపై తనదైన నటనతో కట్టిపడేసిన ఈ అమ్మడు.. చాలాకాలం పాటు నటనకు దూరంగా ఉంటుంది. తెలుగు, హిందీ, తమిళంలో పలు చిత్రాల్లో నటించింది. తను మరెవరో కాదు.. లేడీ సూపర్ స్టార్ నయనతార. నటిగా బిగ్ స్క్రీన్ పై మెరుపులు మెరిపించడంలోనే కాదు.. వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టకుండా తన లైఫ్ తాను సంతోషంగా మార్చుకుంది. ప్రస్తుతం తన భర్త, కొడుకులతో ఇప్పుడు ఫ్యామిలీ లైఫ్ ఆనందంగా గడుపుతుంది. తాజాగా నయన్ తన ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోస్ చూసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్. కొన్ని రోజులుగా ఫోటోషూట్లకు దూరంగా ఉంటున్న నయన్.. తాజాగా కిల్లింగ్ చూపులతో అదరగొట్టేసింది. ఆ ఫోటోలలో నయన్ న్యాచురల్ అందంగా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆమె ఎంపిక చేసుకున్న దుస్తులు, ఎక్స్‌ప్రెషన్స్, ఫోటోగ్రఫీ థీమ్ ప్రతిదీ ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా నయనతార అందాన్ని ఎలివేట్ చేసేలా క్లిక్ చేసిన స్పెషల్ ఫోటోస్ మరింత వైరల్ అవుతున్నాయి. నయన్ ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. షారుఖ్ ఖాన్ సరసన జవాన్ తో సూపర్ హిట్ అందుకుంది. మరోవైపు ఇప్పటికే కుముద చిత్రీకరణ పూర్తికాగా.. మన్నాగట్టి, డియర్ స్టూడెంట్స్, తని ఒరువన్ 2 , మూకుతి అమ్మన్ 2 చిత్రాల్లో నటిస్తుంది. అలాగే జయన రవి సరసన నటించాల్సిన తని ఒరువన్ 2 మూవీ చాలా ఆలస్యమైన సంగతి తెలిసిందే. ఈ అప్డేట్స్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఫ్యాన్స్. త్వరలోనే నయన్ చిత్రాలు అడియన్స్ ముందుకు రానున్నాయి.